తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 4

సంచిక : 24

పేజీలు - 8

వెల- రూ 5:00

prajamantalu.com

# ప్రజా మంటలు

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

బుధవారం 13, జూన్-2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon, Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri


## మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

నర్మదా పూజలో పాల్గొన్న ప్రియాంకా వాద్రా

5లో..



## రాగల రెండు రోజుల్లో పలుచోట్ల వర్షాలు

### హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్,జూన్12(ప్రజామంటలు) : తెలంగాణలో రాగల రెండు రోజుల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశాలున్నాయని పేర్కొంది. మిగతా ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే సూచనలున్నాయని తెలిపింది. లాగే కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వడగాల్పులు వీస్తాయని హెచ్చరించింది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. ఈ మేరకు వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## ఆత్మగౌరవం పంచేలా డబుల్ ఇళ్లు

### నిర్మల్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన మంత్రి

నిర్మల్,జూన్12(ప్రజామంటలు) : పేదలు ఆత్మగౌరవంగా బ్రతుకాలన్నదే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన అని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. అందుకే పేదలకు డబుల్ ఇళ్లను కట్టిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో వారు ఉన్నతంగా బతుకుతున్నారని అన్నారు. నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలో బంగల్ పేట్, నాగనాయి పేటలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పనులు పూర్తి కావడంతో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అల్లోల మాట్లాడుతూ.. నిర్మల్ నియోజకవవర్గంలో దశలవారీగా డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాలు పూర్తి కావడంతో విడతల వారీగా గృహ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దీంతో అర్హులైన ప్రతి నిరుపేదకు సొంతింటి కల సాకారం కాబోతుందని అన్నారు.





## గద్వాల జిల్లాకు కేసీఆర్ వరాల జల్లు

- పంచాయితీలకు 10 లక్షల చొప్పున గ్రాంట్
- 12 మండలాలు.. నాలుగు మున్సిపాలిటీలు
- గద్వాల మున్సిపాలిటీ చాలా పెద్ద మున్సిపాలిటీ
- గద్వాల మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ. 50 కోట్లు,

జోగులాంబ గద్వాల,,జూన్12(ప్రజామంటలు) : జోగులాంబ గద్వాల జిల్లాపై ముఖ్యమంత్రి కేసీఆర్ వరాల జల్లు కురిపించారు. జిల్లాలోని గ్రామ పంచాయతీలకు, మండల కేంద్రాలకు, మున్సిపాలిటీలకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నట్లు కేసీఆర్ ప్రకటించారు. గద్వాల జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ ఆఫీసు, కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం అయిజ రోడ్డులో ఏర్పటు చేసిన బీఆర్ఎస్ బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. ద్వాల జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు.. 12 మండలాలు.. నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయని కేసీఆర్ తెలిపారు. ఇది వరకు ఇక్కడకు రాలేదు.. తొలిసారి వచ్చిన కాబట్టి.. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడానికి రూ. 10 లక్షల చొప్పున ప్రత్యేక గ్రాంట్ మంజూరు చేస్తున్నాం. దాంతో బాగా చేసుకోవాలని కోరుతున్నాను. మండల కేంద్రాలను అభివృద్ధి చేయడానికి ప్రతి మండల కేంద్రానికి రూ. 15 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నాను. గద్వాల మున్సిపాలిటీ చాలా పెద్ద మున్సిపాలిటీ. గద్వాల మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ. 50 కోట్లు, మిగిలిన మూడు మున్సిపాలిటీలకు రూ. 25 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నాను. ఈ నిధులతో మున్సిపాలిటీలు బాగుపడాలి. అద్భుతమైన పనులు జరగాలి. ఇంకా మనం ముందుకు పోవాల్సిన అవసరం ఉంది. వాటన్నింటిని మనం సాధించుకుందాం. గట్టు ఎత్తిపోతల పథకాన్ని, అలంపూర్‌లో ఆర్డీఎస్‌కు కొనసాగింపుగా ఉన్న మల్లమ్మ కుంట పథకాన్ని వీలైనంత తొందరలో పూర్తి చేస్తామని మనవి చేస్తున్నాను అని కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.

## తొమ్మిదేళ్ళ పాలనలో తెలంగాణ సర్వతోముఖాభివృద్ధి

### సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్

(రామ కిష్టయ్య సంగన భట్ల)



ధర్మపురి జూన్ 12 (ప్రజా మంటలు) : దశాబ్దాలుగా వలస పాలకుల వివక్షకు గురైన తెలంగాణ ప్రాంతం, నూతన రాష్ట్రం ఏర్పడిన తర్వాత గడిచిన 9 ఏండ్లలో అన్ని రంగాలను అభివృద్ధి చేసుకుని దేశంలో గర్వించదగ్గ రాష్ట్రంగా తీర్చి దిద్ద బడిందని, అందుకే ఈ సందర్భంగా ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించడం జరుగుతున్నదని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు.దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ధర్మపురి పట్టణంలో సోమవారం నంది చౌక్ వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రన్ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి, కలెక్టర్ యాస్మిన్ భాషా తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ...తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో గడిచిన 9 ఏండ్లలో ఓ వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమ రంగంలో అద్భుతమైన ఫలితాలు సాధించి దేశం లో ఏ రాష్ట్రం లో లేని విదంగా ఆదర్శంగా నిలిచిందన్నారు. వాస్తవంగా ఒక్కో ఇంటికి నాలుగు రకాల సంక్షేమ పథకాల ద్వారా లబ్ది పొంది ప్రజలు ఎంతో సంతృప్తిగా ఉన్నారని, వారి ఆనందంలో పాలు పంచుకోవడం కోసం ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల ఏర్పాటు చేపట్టిందని తెలిపారు. చెరువుల పండగలో రాష్ట్రంలో ఒకే రోజు కోటి మంది బోనాలు బతుకమ్మ లతో ఆనందంగా పాల్గొన్నారని అన్నారు. అభివృద్ధికి ధర్మపురి క్షేత్రం సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నదని, సీఎం కేసీఆర్ చొరవ,

## కులవృత్తులకు రూ. లక్ష ఆర్థిక సహాయం

### ఆన్‌లైన్‌లో దాదాపు 53 వేలు దరఖాస్తులు

### ఇకనుంచి వెబ్‌సైట్ ద్వారా హాస్టల్ సీట్ల భర్తీ

### మంత్రి గంగుల కమలాకర్ వెల్లడి

హైదరాబాద్,జూన్12(ప్రజామంటలు) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న వెనుకబడిన వర్గాల కులవృత్తులకు రూ. లక్ష ఆర్థిక సహాయం కోసం ఇప్పటి వరకూ దాదాపు 53 వేలు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదయ్యాయని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రావెంకటేశం ఇతర ఉన్నతాధికారులతో మంత్రి గంగుల కమలాకర్ సచివాలయంలో ఇదే అంశంపై ఉన్నత స్థాయి



మిగతా 2లో..

## గ్రూప్-3, గ్రూప్-4 పరీక్షలపై స్టేకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్,జూన్12(ప్రజామంటలు) : టీఎస్‌పీఎస్సీ నిర్వహించే గ్రూప్-3, గ్రూప్-4 పరీక్షలపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరించింది. ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియ నిలిపివేయలేమని కోర్టు స్పష్టం చేసింది. గ్రూప్-3, గ్రూప్-4లో టైపిస్ట్ కమ్ అసిస్టెంట్ పోస్టులను తొలగించారని పిటిషన్‌లో పిటిషనర్ పేర్కొన్నారు. జీవో 55, 136 కొట్టివేయాలన్న పిటిషన్లపై చీఫ్ జస్టిస్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి, టీఎస్‌పీఎస్సీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జులై 13కు వాయిదా వేసింది కోర్టు. గ్రూప్ 3, 4లో టైపిస్ట్ కమ్ అసిస్టెంట్ పోస్టులు తొలగించారని హైకోర్టులో 101 మంది పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో వాదనలు కొనసాగాయి. ఇరువార్గాల వాదనలు విన్న న్యాయస్థానం ఉద్యోగ నియామక ప్రక్రియను నిలిపివేయలేమని స్పష్టం చేసింది. అలాగే ప్రభుత్వం, టీఎస్‌పీఎస్సీ కి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ జులై 13కి వాయిదా పడింది.

## కుసుమ జగదీశ్‌కు కన్నీటి వీడ్కోలు

### నివాళి అర్పించిన మంత్రులు కెటిఆర్ తదితరులు

### పాడెమోసిన మంత్రి సత్యవతి రాథోడ్



ములుగు,జూన్12 (ప్రజామంటలు) : బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు, జిల్లా జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ కు కన్నీటి వీడ్కోలు పలికారు. అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర కొనసాగింది. జగదీశ్ పార్థివ దేహానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పుష్పాంజలి ఘటించారు. ఆయన భౌతికకాయంపై బీఆర్ఎస్ పార్టీ జెండా కప్పారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంత్రి కేటీఆర్ తోపాటు మంత్రులు పువ్వాడ అజ య్, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్య వతి రాథోడ్, జగదీశ్ రెడ్డి, ఎంపీలు సంతోష్ కుమార్, రంజిత్ రెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, కడియం శ్రీహరి, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. మంత్రి సత్యవతి రాథోడ్.. జగదీశ్ పాడెను మోశారు. కుసుమ జగదీశ్ ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుతో హఠాన్మరణం చెందిన విషయం తెలిసిందే. కుసుమ జగదీశ్ భౌతిక కాయానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ నివాళులర్పించారు. ములుగు జిల్లా మల్లంపల్లిలోలోని ఆయన నివాసానికి చేరుకున్న మంత్రి కేటీఆర్.. జగదీశ్ పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. హనుమకొండ స్నేహనగర్‌లో ఉంటున్న ఆయన ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఇంట్లో స్నానం చేసి బయటకు వస్తుండగా అస్వస్థతకు గురయ్యారు. గన్‌మెన్ల సాయంతో భార్య రమాదేవి వెంటనే ఆయనను హనుమకొండలోని దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు హైదరాబాద్‌కు తరలించాలని సూచించగా సమయం లేకపోవడంతో అక్కడే అజార దవాఖానకు తీసుకెళ్లారు. అయితే అక్కడ చికిత్స అందిస్తుండగానే కన్నుమూశారు. 14 ఏండ్లపాటు హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలోనే ఉంటూ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో జగదీశ్ కీలక పాత్ర పోషించారు. గత ఎన్నికల సమయంలో ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ములుగు జిల్లా ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆయనకు జిల్లా పరిషత్ చైర్మన్ అవకాశం కల్పించారు. ఏప్రిల్ 1న జగదీశ్వర్ తొలిసారి గుండెపోటుకు గురికాగా భార్య రమాదేవి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. ఆ తర్వాత హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స తీసుకున్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9న నిర్వహించిన సంక్షేమ సంబురాల్లోనూ పాల్గొన్నారు.

## సిద్దిపేట నుండి ఎల్కతుర్తి జాతీయ రహదారి నిర్మాణం



- పనులను పరిశీలించిన జవదేకర్, బండి సంజయ్

2లో..

## ప్రజానాడి



## ధరణి ముసుగులో దళారీ పనులు

- కిషన్ రెడ్డి స్వగ్రామంలో భూదాన్ భూములు మాయం
- వేయికోట్ల విలువైన భూములకు రెక్కలు
- మరోమారు ధరణిపై రేవంత్ విమర్శలు

మిగతా 2లో..

## ధరణిపై దళారీ మాటలు



జోగులాంబ గద్వాల,జూన్12 (ప్రజామంటలు) : రైతుల సమస్యలు పరిష్కరిస్తూ..వారికి రైతుబంధును సకాలంలో అందచేస్తున్న ధరణిని రద్దు చేయాలని కొందరు దళారీ మాటలు మాట్లాడుతున్నారని సిఎం కెసిఆర్ మండిపడ్డారు. ధరణిని ఉంచుదామా తీసేద్దామా అంటూ గద్వాల సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఇలాంటి వారి మాటలను నమ్మవద్దన్నారు. ధరణిని బంగాళాఖాతంలో విసిరేయాలన్న వారికి గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. గద్వాలలో కలెక్టరే, ఎస్పీ కార్యాలయాలతో పాటు బిఆర్ఎస్ కార్యాలయాన్ని సిఎం కెసిఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో గద్వాల జిల్లా ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమం నాటి పరిస్థితులు గుర్తు చేసుకుంటే ఒకనాడు చాలా కష్టాల్లో మునిగిపోయి పాలమూరు జిల్లా గంజి కేంద్రాలకు నిలయంగా ఉండేదన్నారు. మనకున్న ఆర్డీఎస్ కాల్వను మనకు కాకుండా జేసి గద్దల్లా తన్నుకుపోతే ఉద్యమంలో మొట్టమొదటి పాదయాత్ర చేపట్టింది నేనే. జోగులాంబ తల్లికి దండం పెట్టి గద్వాల వరకు పాదయాత్ర చేపట్టాను అని కేసీఆర్ తెలిపారు. అయిజ రోడ్డులో ఏర్పటు చేసిన బీఆర్ఎస్ బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక చోట్ల అలంపూర్, గద్వాల్, నడిగడ్డలో పర్యటించాను అని కేసీఆర్ గుర్తు చేశారు. నాడు హృదయవిదరాక దృశ్యాలు కనబడ్డాయి. కన్నీళ్లు పెట్టుకున్నాం. ఇక్కడ సభ పెడితే ప్రళయ గర్జనలాగా వచ్చారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత పరిపాలన సంస్కరణలు చేసుకున్నాం. సంస్కరణల్లో భాగంగా గద్వాల జిల్లా ఏర్పడింది. రాజభవనాలను తలపించే కలెక్టరేట్, పోలీసు భవనాలు ప్రారంభించుకున్నాం. జిల్లా ప్రజలు బాగుండాలని జోగులాంబ గద్వాల జిల్లా అని ఈ జిల్లాకు పేరు పెట్టుకున్నామని కేసీఆర్ తెలిపారు. నెట్టెంపాడు, బీమా ద్వారా సాగునీరు అందుతుందని కేసీఆర్ తెలిపారు. గట్టు పునాదిరాయి వేసుకున్నాం. ఆ పనులు కూడా త్వరలోనే

మిగతా 2లో..

- ధరణితోనే రైతుబంధు జమ అవుతోంది
- ధరణిపై దళారీల మాటలు నమ్మవద్దు
- గట్టు ఎత్తిపోతలతో గద్వాల బంగారు తునక
- ఆర్టీఎస్‌ను తన్నుకుపోతే ఇక్కడే ఉద్యమించా
- నాటికీ నేటికీ తేడాను ప్రజలు గమనించాలి
- గద్వాల సభలో సిఎం కెసిఆర్

# ధరణిపై దళారీ మాటలు

(మొదటిపేజీ తరువాయి)

పూర్తవుతాయన్నారు. ప్రజల సంక్షేమానికి పుట్టిన నుంచి చనిపోయే వరకు ప్రతి ఒక్కరికి సహాయం అందేలా ఆదుకుంటున్నాం. గురుకుల పాఠశాలల్లో గిరిజన, దళిత, బీసీ బిడ్డలు బ్రహ్మాండంగా చదువుకుంటున్నారు. అన్నింటిని కూడా జూనియర్ కాలేజీలుగా మార్చుకున్నాం. పిల్లలు మంచిగా చదువుకుంటున్నారు అని కేసీఆర్ తెలిపారు. ఈ ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి మంత్రులుగా ఉన్న ఇద్దరికి ఇద్దరు కూడా తెలంగాణ ఉద్యమకారులే అని కేసీఆర్ తెలిపారు. నిరంజన్ రెడ్డి ఫీల్డ్ మీద, శ్రీనివాస్ గౌడ్ టీజీవో అధ్యక్షుడిగా ఉంటూ ఉద్యోగాన్ని లెక్క చేయకుండా ఉద్యమం చేశారు. లక్ష్మా రెడ్డి కూడా ఉద్యమంలో పని చేశారు. పాత పాలమూరు జిల్లా ఐదు జిల్లాలుగా మారింది. ఐదు మెడికల్ కాలేజీలు వచ్చాయి. కల్వకుర్తి ఎత్తిపోతల, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, బీమా అన్నింటిని పూర్తి చేసుకుని 15 నుంచి 24 లక్షల ఎకరాలకు నీరు ఇచ్చుకుంటున్నాం. ఉచిత కరెంట్ ఇస్తున్నాం, రైతు బంధు ఇస్తున్నాం అని కేసీఆర్ వివరించారు. కేసీఆర్ కన్నా దొడ్డుగా, ఎత్తుగా ఉన్నోళ్లు ఈ జిల్లా నుంచి మంత్రులు అయ్యారని కేసీఆర్ తెలిపారు. వారి కాలంలో ఏం జరిగిందంటే ఏం లేదు. గద్వాలలో ఉన్నవారు ప్రాజెక్టులు పూర్తి చేయించలేదు. భయంకరమైన బాధ.. 14 రోజులకు ఒకనాడు మహబూబ్‌నగర్‌లో నీళ్లు దొరికేవి. ఇవాళ మిషన్ భగీరథ ద్వారా నీళ్లు అందిస్తున్నాం. దేశంలో ఎక్కడా ఇలాంటి పథకం లేదు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, అమ్మ ఒడి వంటి కార్యక్రమాలు చేసుకున్నాం. గతంలో బతుకు లేక మనం వలసపోయాం. ఇవాళ కర్నూల్, రాయిచూర్ నుంచి మన వద్దకు వలస వస్తున్నారు. పాలమూరు జిల్లాలో అభివృద్ధి వేగంగా జరుగుతోంది. తెలంగాణ ఏర్పడితే కరెంట్ రాదు అని మాట్లాడారు. తుంగభద్ర బ్రిడ్జి దాటితే 24 గంటల కరెంట్



లేదు. ఆ విధంగా చాలా బ్రహ్మాండమైన పనులు చేసుకున్నాం అని కేసీఆర్ తెలిపారు. గట్టు ఎత్తిపోతల పూర్తయితే గద్వాల వజ్రపు, బంగారు తునక అవుతుందని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. గద్వాల జిల్లాకు మెడికల్ కాలేజీ కూడా రాబోతుందని కేసీఆర్ తెలిపారు. గద్వాల జిల్లా పరిపాలన భవనం తన చేతుల మీదుగా ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది అని కేసీఆర్ తెలిపారు. హృదయపూర్వకంగా జిల్లా ప్రజాప్రతినిధులను, ఉద్యోగులను, ప్రజలను అభినందిస్తున్నానని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ రోజు దేశంలో తెలంగాణ అనేక రంగాల్లో అగ్రస్థానంలో ఉంది. పర్ క్యాపిట ఇన్‌కంలో, పర్ క్యాపిట పవర్ యుటిలైజేషన్‌లో, ఓడీఎఫ్ ప్లస్‌లో కూడా నంబర్ వన్‌లో ఉన్నాం. అన్నింటికి మించి ఉద్యమ సమయంలో ఇదే గద్వాలలోని నడిగడ్డకు వచ్చినప్పుడు.. ఓ ఊరికి వెళ్లాను. చాలా ఆవేశం వచ్చి అక్కడ తాను, ప్రజలు ఏడ్చేశాం. ఏడవాల్సిన సందర్భం ఎందుకు వచ్చిందంటే.. రెండు నదుల మధ్య ఉన్న నడిగడ్డకు నీళ్లు రాలేదని. అందుకోసం పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో అభివృద్ధి చేసుకుంటున్నాం. గట్టు లిఫ్ట్ పూర్తయితే అసలు గద్వాల వజ్రపు, బంగారు తునక అవుతుంది. తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా ఆర్డీఎస్‌ను మళ్లీ సాధించుకున్నాం. అలంపూర్ కూడా అద్భుతంగా తయారు కాబోతుందన్నారు. రాబోయే రోజుల్ల ఇంకా సాధించాల్సి ఉందని ఉద్యోగులకు కేసీఆర్ సూచించారు. ప్రభుత్వంలో మీరు చాలా ఏండ్లు పని చేస్తున్నారు. మానవీయ కోణంలో ఆలోచించి అనేక స్టెప్స్ తీసుకుంటున్నాం. స్టంటింగ్ ప్రాబ్లం అని ఒకటి ఉంటుంది. పిల్లల పెరుగుదల ఆగిపోతే దానికి కారణం మాల్ న్యూట్రిషన్ కారణం. ఒకసారి ఒక జనరేషన్ స్టంటింగ్ బారిన పడితే.. అది రిపేర్ కావడానికి 150 సంవత్సరాలు పడుతుంది. మన దగ్గర లాంటి బాధ రావొద్దనే అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ప్రపంచంలో ఎవరూ ఆలోచించని విధంగా కంటి వెలుగు కార్యక్రమం తీసుకున్నాం. ఇలాంటి హ్యూమన్ యాంగిల్ ప్రపంచంలో ఎక్కడా కనిపించదు. ప్రజల ఆయురారోగ్యాలు బాగుండాలని అనేక కార్యక్రమాలు తీసుకొని ముందుకు పోతున్నాం అని కేసీఆర్ పేర్కొన్నారు. బాగుపడ్డామని చెప్పి రిలాక్స్ అయిపోతే మనం దెబ్బతినే ప్రమాదం ఉందని కేసీఆర్ అన్నారు. వరి ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్‌ను అధిగమించి మనం నంబర్ వన్ స్థానంలో ఉన్నాం. ఈ రకంగా బ్రహ్మాండంగా చేసుకుంటున్నాం. గద్వాలకు మెడికల్ కాలేజీ రాబోతుంది. పాత పాలమూరు జిల్లాకు ఐదు మెడికల్ కాలేజీలు వచ్చాయి. సంపద పెరుగుతుంది కాబట్టి.. ఇది సాధ్యమైంది. పట్టు వీడకుండా ఇదే పట్టుదలతో ముందుకు పోతే అనేక విజయాలు సాధిస్తాం. ఐటీ రంగంలో కూడా ముందు వరుసలో ఉన్నం. పరిశ్రమలు, పెట్టుబడులు దండిగా వస్తున్నాయని కేసీఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీనివాసగౌడ్,నిరంజన్ రెడ్డి, మహ్మూద్ అలీ, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## ప్రపంచ రక్తదాతల దినోత్సవ పోస్టర్

### విడుదల చేసిన జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు...

విజయవాడ,జూన్12 : జూన్ 14 వ తేదీ ప్రపంచ రక్త దాతలు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యాధికారులతో కలిసి సోమవారం స్థానిక పింగళి వెంకయ్య సమావేశం మందిరంలో ప్రపంచ రక్త దాతల దినోత్సవ అవగాహన పోస్టర్ ను కలెక్టర్ ఢిల్లీ రావు విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరు రక్తదానానికి ముందుకు రావాలని, ఒకరు రక్తదానం చేస్తే నలుగురికి సహకారం అందించిన వారు అవుతారన్నారు. జూన్ 14 వ తేదీన ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 3:30 వరకు బ్లడ్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ వద్ద, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం విజయవాడ, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంకు ఎంజీ రోడ్డు తనీష్ జ్యువెలరీ వద్ద, లయన్స్ బ్లడ్ బ్యాంక్ సూర్యారావుపేట వద్ద నిర్వహిస్తున్నట్టు వైద్యాధికారులు కలెక్టర్ ఢిల్లీ రావుకు వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి సంపత్ కుమార్. డిఆర్ఓ కె మోహన్ కుమార్ డిఎం అండ్ హెచ్ ఓ డా. సుహాసిని, డిఎల్ఏటి కంట్రోల్ ఆఫీసర్ జె. ఉషారాణి పాల్గొన్నారు.



## ఎపి శ్రేయస్సు కోరుతూ పవన్ యాగం

### జనసేన కార్యాలయంలో పండగవాతావరణం

గుంటూరు,జూన్12 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శ్రేయస్సు కోరుతూ... జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలోని విశాల ప్రాంగణంలో హోమం నిర్వహించారు. ఇదే సమయంలో.. కార్యాలయ ప్రాంగణంలో భవన నిర్మాణం కోసం పవన్ భూమి పూజ నిర్వహించారు. సోమవారం ఉదయం 6:55 గంటలకు సాంప్రదాయబద్ధంగా పట్టు వస్త్రాల ధారణలో పవన్ యాగశాలకు వచ్చి దీక్ష చేపట్టారు. ఇందుకు సంబంధించి.. జనసేన పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది. విగ్రహం.. యంత్రం.. హోమం ఆలంబనగా ఈరోజు ఉదయం ప్రారంభమైన ఈ యాగం రేపు కూడా కొనసాగుతుంది. ఈ యాగానికి గణపతి పూజతో స్వయంగా అంకురార్పణ చేసి దేవతామూర్తులకు ప్రణతులు అర్పించారు. యాగశాలలో ఐదుగురు దేవతామూర్తులను ప్రతిష్ఠాపించారు. ఈ యాగపీఠంపై పరివేష్టితులై ఉన్నారు. ఈ ఐదు దేవతా మూర్తులకు అభిముఖంగా యంత్రస్థాపన చేపట్టారు. యాగ సాంప్రదాయ మేళవింపులో భాగంగా.. మామిడి తోరణాలు, పూలహారాలు, అరటిచెట్లు, రంగవల్లుల అలంకరణతో యాగశాలను అలంకరించారు. కేవలం రుత్వికులు మాత్రమే సాంప్రదాయబద్ధంగా ఈ యాగాన్ని నిర్వర్తిస్తున్నారు. ఇప్పటివరకూ ఒక లెక్క-ఇప్పట్నుంచి మరో లెక్క అన్నట్టుగా ఇకపై మంగళగిరిలోనే ఉండబోతున్నారు. పవన్ ఒక్కరే కాదు, జనసేన ఆపరేషన్స్ అన్నీ మంగళగిరి నుంచే జరగనున్నాయ్. ఇప్పటివరకు హైదరాబాద్ నుంచి జరుగుతోన్న కార్యకలాపాలను కూడా మంగళగిరి నుంచే నిర్వహించాలని జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఇకపై జనసేన విభాగాలన్నీ మంగళగిరి పార్టీ ఆఫీస్ నుంచే పనిచేయను న్నాయి. 12వందల గజాల స్థలంలో జీప్లస్ 5 భవనం కోసం భూమిపూజ చేశారు. ఎన్నికల్లోపే ఈ భవన నిర్మాణం పూర్తిచేసి ఇక్కడ్నుంచే అన్ని విభాగాలు పనిచేసేలా ప్లాన్ చేశారు. ఈ క్రమంలోనే మంగళగిరి జనసేన ఆఫీస్‌లో ప్రస్తుతం ప్రత్యేక యాగం చేపట్టారు.

## ధరణి ముసుగులో దళారీ పనులు

హైదరాబాద్,జూన్12: ధరణి ముసుగులో తండ్రీ కొడుకులు భారీ భూస్కాములకు పాల్పడుతున్నారని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మరోమారు ఘాటు విమర్శించారు. ధరణిని రద్దు చేయాలంటే రద్దు వద్దని అంటున్నారని అన్నారు. స్వయంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్వగ్రామంలోనే వేయికోట్ల విలువైన భూదన్ భూములు కెటిఆర్ అనుచరుల పేరున రిజిస్టర్ అయ్యాయని ఆరోపించారు.రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్‌లో భారీ భూస్కామ్ జరిగిందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. భూస్కామ్‌లో బిఆర్ఎస్ నేతలు, పార్టీ ఫిరాయించిన నేతలున్నారని ఆరోపించారు. భూదాన్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయన్నారు. రంగారెడ్డి జిల్లా నేతలతో కలిసి తిమ్మాపూర్ భూములను కేటీఆర్ దోచుకుంటున్నారని రేవంత్ ఆరోపించారు. తన గ్రామంలోని భూములు అన్యాక్రాంతమవుతుంటే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడట్లేదని ఆయన ప్రశ్నించారు. తిమ్మాపూర్ భూదాన్ భూములపై దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కు ధరణి బంగారు గుడ్డుపెట్టే బాతులా మారిందన్నారు. 30శాతం కమిషన్ ఇస్తేనే కలెక్టర్లు ధరణి సమస్యలు పరిష్కరిస్తున్నారని చెప్పారు. కలెక్టర్లను కేటీఆర్ కీలు బొమ్మలుగా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి రద్దు చేసి ప్రజలకు ఇబ్బందుల్లేని పాలసీ తెస్తామంటే కేసీఆర్‌కు ఎందుకంత ఏడుపు అని ప్రశ్నించారు. ధరణి విషయంలో కేసీఆరే పెద్ద దళారీ అన్నారు. దళారీ వ్యవస్థను రద్దు చేస్తామంటూ కెసిఆర్, కెటిఆర్‌లు పెద్ద దళారీ అవతారం ఎత్తారని అన్నారు.

## కులవృత్తులకు రూ. లక్ష ఆర్థిక సహాయం

(మొదటిపేజీ తరువాయి)

సమీక్ష నిర్వహించారు. కులవృత్తులకు ఘనవైభవం తీసుకొచ్చి వారి జీవితాలను మెరుగుపర్చేందుకు సీఎం కేసీఆర్ సంకల్పించారని, వారి కులవృత్తికి ఉపయోగపడే ముడిసరుకు, పనిముట్లు కొనుగోలు చేసేందుకు గానూ ఎలాంటి బ్యాంకు లింకేజీ లేకుండా, తిరిగి చెల్లించే అవసరం లేకుండా రూ. లక్ష సహాయం ప్రభుత్వం చేస్తుందన్నారు. ఈనెల 20వ తేదీ వరకు పథకానికి సంపూర్ణంగా ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఎవరినీ ప్రత్యక్షంగా కలవాల్సిన అవసరం లేదన్న మంత్రి, ఆదాయ పత్రాలు సైతం 2021 ఏప్రిల్ నుండి జారీ చేసినవి చెల్లుబాటవుతాయన్నారు. జిల్లా కలెక్టర్లు సైతం అవసరార్థుల ఆదాయ సర్టిఫికెట్ల జారీపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. చాలా సరళంగా ఉన్న అప్లికేషన్ ఫారంను దరఖాస్తుదారులు తమ స్మార్ట్ ఫోన్ల నుండి సమర్పించవచ్చని సూచించారు. రాష్ట్రంలోని 703 బీసీ ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలోని సీట్లను ఇకనుండి సంపూర్ణంగా ఆన్‌లైన్ ద్వారానే భర్తీ చేస్తామని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఇందుకు సంబందించిన వెబ్‌సైట్ ని సచివాలయంలో అధికారికంగా లాంచ్ చేసారు. ఈ విద్యా సంవత్సరం నుండే దీన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. వెబ్‌సైట్‌లో సూచించిన ఆన్‌లైన్ అడ్మిషన్ ఫామ్ నింపి దరఖాస్తు సమర్పించగానే ఎవరి ప్రమేయం లేకుండా వివరాలు వెరిఫికేషన్ చేసుకొని ప్రవేశానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ సమీక్షలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రావెంకటేశం, టాడీ టాపర్స్ కార్పోరేషన్ ఛైర్మన్ పల్లె రవి, బీసీ సంక్షేమ శాఖ డీడీ సంధ్య ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తొమ్మిదేళ్ళ పాలనలో తెలంగాణ సర్వతోముఖాభివృద్ధి

తమ కృషి ఫలితంగా 100కోట్లతో దేవస్తానం, 50కోట్లతో మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నది అన్నారు. ఇక తెలంగాణ రన్ ద్వారా అందరూ ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ యాస్మిన్ భాషా, అదనపు కలెక్టర్ మంద మకరందు, ఎస్పీ భాస్కర్, డీసీఎంఎస్ ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, డీ ఆర్ డీ ఓ లక్ష్మీ నారాయణ, మున్సిపల్ కమిషనర్ రమేశ్, తహసీల్దార్ వెంకటేశ్, డీఎస్పీ ప్రకాష్, సీఐ కోటేశ్వర్, ఎస్సై కిరణ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ సత్తమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీలు అరుణ, రాజేందర్, మార్కెట్ చైర్మన్ రాజేశ్ కుమార్, వైస్ చైర్మన్ సునీల్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ రామయ్య, రైతు కమిటీ చైర్మన్ భీమయ్య, మల్లేశం, తెరాస అధ్యక్షుడు శేఖర్, ప్రజా ప్రతినిధులు యువకులు, విద్యార్థులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, అధిక సంఖ్యలో మహిళలు, క్రీడాకారులు, సిబ్బంది పాల్గొన్నారు. నంది విగ్రహ కూడలి నుండి ప్రారంభించి, బస్ స్టేషన్, గాంధీ విగ్రహ కూడలి, పోలీస్ స్టేషన్, పటేల్ విగ్రహ కూడలి, అంబేద్కర్ విగ్రహ కూడలి, ఆంజనేయ విగ్రహ కూడలి వరకు తెలంగాణ రన్ నిర్వహించారు.

# చురుకుగా కదులుతున్న నైరుతి

### వచ్చే వారం దాకా ఆగాలన్న వాతావరణ శాఖ

హైదరాబాద్,జూన్12 : నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. కర్ణాటక, తమిళనాడులోని, ఏపీలోని పలు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తెలంగాణలోకి వచ్చే వారం ప్రవేశించే అవకాశాలున్నాయని అంచనా వేసింది. పశ్చిమ దిశ నుంచి తెలంగాణ రాష్ట్రంవైపు దిగువస్థాయిలో గాలులు వీస్తున్నాయని, వీటి ప్రభావంతో రాబోయే రెండురోజులు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మరో వైపు సోమవారం పలు జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు భారీగానే నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో 42.3, భద్రాచలం 42.2, నల్లగొండలో 41.5, రామగుండంలో 41.4, హనుమకొండలో 41, మెదక్ 40.2, నిజామాబాద్‌లో 40 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ వివరించింది. రేబియా సముద్రంలో ఈ ఏడాది తొలిసారి ఏర్పడిన బిపోర్‌జాయ్ తుఫాను అతితీవ్రంగా మారింది. ప్రస్తుతం గుజరాత్ వైపు దూసుకువస్తుందని భారత వాతావరణ శాఖ (ఎఓఆ) తెలిపింది. మరో 36 గంటల్లో మరింత బలపడి..గుజరాత్‌లోని కచ్, పాక్‌లోని కరాచీ మధ్య ఈ నెల 15న తీరాన్ని దాటే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే గుజరాత్ తీరప్రాంతాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గుజరాత్‌తో పాటు కర్ణాటక, గోవాల్లోనూ ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లోనూ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. తుఫాను ప్రభావంతో పశ్చిమ తీర ప్రాంతాల్లో వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించింది. సముద్రమంతా అల్లకల్లోలంగా మారిందని తెలిపింది. ప్రస్తుతం తూరు, మధ్య అరేబియా తీరంలో కేంద్రీకృతమైన తుఫాను గంటకు 8కిలోమీటర్ల వేగంతో ఈశాన్య దిశగా కదులుతున్నట్లు ఐఎండీ వెల్లడించింది. తుఫాను తీరం దాటే సమయంలో గంటకు 150 కి.మీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. తుఫాను నేపథ్యంలో ఈ నెల 15 వరకు మత్స్యకారులు



వేటకు సముద్రంలోకి వెళ్లొద్దని వాతావరణ శాఖ సూచించింది. మరో వైపు లోతట్టు ప్రాంతాల ప్రజలను తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెల్టర్లలోకి తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు 1,300 మందిని తరలించినట్లు వివరించారు.

## సిద్దిపేట నుండి ఎల్కతుర్తి జాతీయ రహదారి నిర్మాణం

### పనులను పరిశీలించిన జవదేకర్, బండి సంజయ్

సిద్దిపేట,జూన్12 : కోహెడ మండలం పెద్ద సముద్రాల వద్ద సిద్దిపేట నుండి ఎల్కతుర్తి వరకు జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులను మాజీ కేంద్ర మంత్రి ప్రకాష్ జవదేకర్‌తో కలిసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ పరిశీలించారు. రహదారి నిర్మాణ పనుల తీరుతెన్నులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. సిద్దిపేట - ఎల్కతుర్తి 765 డీఎల్ జాతీయ రహదారి నిర్మాణానికి రూ.578 కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. 9 సంవత్సరాలలో దేశ వ్యాప్తంగా జాతీయ రహదారుల నిర్మాణానికి మోదీ ప్రభుత్వం లక్ష కోట్లు కేటాయించిందని అన్నారు. తాను ఎంపీ అయినప్పటి నుండి నాలుగేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో 7 వేల కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేశానని అన్నారు. కేంద్ర మాజీ మంత్రి ప్రకాష్ జవదేకర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణలో బండి సంజయ్ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని అన్నారు. బండి సంజయ్ అడగ్గానే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సిద్దిపేట - ఎల్కతుర్తి జాతీయ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గత యూపీఏ హయాంలో కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం తక్కువ, అవినీతి ఎక్కువ జరిగిందని ఆరోపించారు. తెలంగాణలో 1948 నుండి 2014 వరకు జాతీయ రహదారుల నిర్మాణానికి కేవలం 2,500 కోట్లు కేటాయిస్తే, ఈ 9 ఏళ్లలో మోదీ ప్రభుత్వం జాతీయ రహదారుల నిర్మాణానికి రూ.2,500 కోట్లు



కేటాయించిందని అన్నారు. ఈ తొమ్మిదేండ్ల మోదీ పాలనలో కేంద్రంలోని ఒక్క మంత్రిపై, ఎంపీపై కూడా అవినీతి ఆరోపణలు రాలేదని అన్నారు. యూపీఏ ప్రభుత్వం కంటే రెండింతలు ఈ తొమ్మిది ఏండ్లలో దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందని అన్నారు. తెలంగాణ కోసం ఆనాడు తాము కూడా కేంద్రంలో పోరాటం చేశామని, కానీ తెలంగాణలో ఇప్పుడు ఒకే కుటుంబం అవినీతి పాలన కొనసాగిస్తుందన్నారు. తొమ్మిదేళ్లలో మోదీ ప్రభుత్వం తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణానికి 1,900 కోట్లు కేటాయించిందని అన్నారు. వచ్చే సంవత్సరం నాటికి ఈ జాతీయ రహదారి నిర్మాణం పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## స్పందనలో 118 అర్జీలు నమోదు...

### ప్రతి ఆర్జీకి పరిష్కారం చూపడమే స్పందన లక్ష్యం..

విజయవాడ,జూన్12 : ప్రజల నుంచి స్వీకరించిన ప్రతీ అర్జీని పరిష్కరించేందుకు అధికారులు చిత్తశుద్దితో పని చేయాలని కలెక్టరు ఎస్ డిల్లీరావు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ డిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డా. పి సంపత్‌కుమార్, డిఆర్‌వో కె. మోహన్‌కుమార్‌లు ప్రజల నుండి అర్జీలు స్వీకరించా రు. కలెక్టరు డిల్లీరావు మాట్లాడుతూ ప్రభుత్వం పై నమ్మకంతో స్పందన కార్యక్రమం ద్వారా తన సమస్య పరిష్కారం అవుతుందనే ఆశతో వస్తున్న ప్రతి ఆర్జీదారుని సమస్యను చిత్తశుద్దితో పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు. అధికారులు సమస్యను నిశితంగా పరిశీలించడం ద్వారా సమస్య తేలికగా పరిష్కారం అవుతుందన్నారు. కొంత మంది అర్జీదారులు గ్రామ స్థాయిలో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక కూడా స్పందనకు వస్తుంటారని అటువంటి వారికి అధికారులు అవగాహన కల్పించాలన్నారు. కొందరు గ్రామీణ ప్రాంత ప్రజలు చిన్న సమస్యను కూడా పెద్ద సమస్యగా భావించి అధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తుంటారన్నారు. అటువంటి గ్రామీణ ప్రజలను అనునయించడం ద్వారా వారికి తమ సమస్య పరిష్కార మార్గం చూపుతుందన్నారు. స్పందనలో శాఖల వారిగా పరిశీలిస్తే ఎక్కువగా నమోదవుతున్న రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ తదితర శాఖల అధికారులు అర్జీల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం స్పందన ఫిర్యాదుల పరిష్కారం పై దృష్టి పెడుతున్నందున అర్జీదారులకు సత్వర న్యాయం చేయడమే లక్ష్యంగా అధికారులు విధులను నిర్వర్తించాలన్నారు. స్పందన అర్జీలతో పాటు ఏపి సేవా డాష్ బోర్డు, టోల్ ఫ్రీ నెంబర్1902, అన్‌లైన్‌లోను నమోదు అవుతున్న అర్జీలను పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ డిల్లీరావు అధికారులను ఆదేశించారు.నేటి స్పందనలో 118 వినతులు నమోదు కాగా వీటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖలో 44, పోలీస్ 19, యంఎయుడి 8, అగ్రికల్చర్ 6, ఏపిఎస్ పిడిసిఎల్ 6, సర్వే అండ్ సెటిలిమెంట్ 4, విద్య 4, డిఆర్‌డిఏ 3, బిసి వెల్ఫేర్ 3, పంచాయతీరాజ్ 3, హెల్త్ 2, సోషల్ వెల్ఫేర్ 2, అటవీ 2, ఇరిగేషన్ 2, దేవదాయ శాఖ 2, పౌర సరఫరాలు 2, ఐసిడిఎస్ 2, డ్వామా 1, భూగర్భ 1, హౌసింగ్ 1, మెప్మా 1 శాఖలలో అర్జీలు నమోదయ్యాయన్నారు. జిల్లాలోని డివిజనల్ అధికారులు, ఆయా మండలాల యంపిడీవోలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో వర్చువల్‌గా జిల్లా కలెక్టర్ పరిష్కారమయ్యే వినతులను అక్కడికక్కడే పరిష్కరించారు. స్పందనలో అర్జీ... అర్జీదారునకు తక్షణ సాంత్వన. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు సోమవారం స్పందన కార్యక్రమంలో పాల్గొని అనంతరం జగనన్న విద్యా కానుక కార్యక్రమం పాల్గొనేందుకు సిద్ధమౌతున్న సమయంలో తమ సమస్య చెప్పుకునేందుకు ఎన్టిఆర్ జిల్లా కంచికచర్ల మండలం బత్తినపాడు గ్రామానికి చెందిన విఆర్ఏ మాజాన్ తన భార్యతో కలిసి కలెక్టర్‌ను కలిసేందుకు ప్రయత్నించారు. మరో కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న ఆయన ఈ వృద్ధ దంపతులను చూసి ఆగిపోయారు. వారు తమ సమస్యను వివరించారు. తాను బత్తినపాడు గ్రామ శాశ్వత నౌకరు (విఆర్ఏ)గా పనిచేస్తున్నట్లు వివరించారు. గత నాలుగేళ్ళగా నాకు ఆరోగ్యం బాగాలేదని పక్షవాతం బారిన పడ్డానని చెప్పారు. అయితే తన స్థానంలో తన కుమారుడికి రెండు సార్లు తాత్కాలిక గ్రామ నౌకరుగా అవకాశం ఇచ్చారని, ఇదే తాత్కాలిక నియామకాన్ని శాశ్వతం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

## విశాఖ గురించి అమిత్ షా ఎందుకు మాట్లాడలేదు: వైవి

విశాఖపట్నం,జూన్12 : విశాఖలోపి జ్ఞానాపురంలో ఎర్నిమాంబ ఆలయ శిఖర ప్రతిష్ట కార్యక్ర మం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్, వైసీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. శిఖర ప్రతిష్ట కార్యక్రమం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖపట్నంకు వచ్చిన అమిత్ షా ఈ ప్రాంతం గురించి ఒక్క మాట కూడా చెప్పకపోవడం..విశాఖ స్టీల్ ఎలాంట్ గురించి కనీసం మాట్లాడక పోవడం దారుణమన్నారు. టీడీపీ ట్రాప్‌లో బీజేపీ అగ్రనాయకత్వం పడిందని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చి బీజేపీలో చేరిన వ్యక్తులు చెప్పిన మాటలను అమిత్ షా పలకడం దారుణమని అన్నారు. తమ ప్రభుత్వం చిత్త శుద్దితో పనిచేస్తుందని.. అలాంటి ప్రభుత్వంపై అమిత్ షా నిందలు వేయడం సరికాదని అన్నారు. 2014 ఎన్నికల్లో బీజేపీ ఎవరితో కలిసి పోటీ చేసిందని ప్రశ్నించారు. గతంలో బీజేపీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయనేది అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## కమిషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం జీవన్ రెడ్డి



కరీంనగర్,జూన్12: పెన్ గంగ లేకపోతే కాళేశ్వరం లేదని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. తుమ్మడి హట్టి వద్ద నిర్మాణం చేస్తే.. మేడిగడ్డ అన్నారం అవసరం లేకుండేనని పేర్కొన్నారు. కాళేశ్వరం కమిషన్లకే పనికి వచ్చిందని విమర్శించారు. పోతిరెడ్డి పాడు నీటిని ఆంధ్ర నేతలు తరలిస్తే.. కేసీఆర్ ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. జగన్‌తో కుమ్మక్కు అయ్యావా కేసీఆర్ అని ప్రశ్నించారు. పోతిరెడ్డి పాడు నీటి తరలింపు కేసీఆర్ వైఫల్యమేనన్నారు. దశాబ్ది ఉత్సవాలకు ఎవరూ రావడం లేదని విందులు ఇస్తున్నారని వ్యాఖ్యానించారు.

# యోగాతో రోగాలు మాయం

### ప్రముఖ యోగా గురువు శ్రీనివాస్



భీమదేవరపల్లి జూన్12 (ప్రజామంటలు): జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని హను మకొండ జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నక్కలగుట్ట హరిత కాకతీయలో జరుగుతున్న యోగా శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం ముత్తారం గ్రామంలోని త్రికుటేశ్వరాలయంలో యోగా శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని ప్రముఖ యోగ గురువు పోషాల శ్రీనివాస్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 25 రోజుల కౌంట్ డౌన్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాల రూపకల్పన చేయడం జరిగిందని అన్నారు. ఈ యోగా శిబిరంలో ప్రాణాయామం, ధ్యానము, ఆసనాలు చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలోజయశ్రీ,లావణ్య,రవికుమార్,చిరంజీవి,రాజేందర్,రవీందర్ ఆనందం, శివలు పాల్గొన్నారు.

# పది రోజుల క్రితం వృద్ధుడు అదృశ్యం

### పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబసభ్యులు



జగిత్యాల జూన్ 12 (ప్రజామంటలు): ఎండు మిరపకాయలు కొనుగోలు చేసి తీసుకువస్థానని వెళ్లిన వృద్ధుడు పది రోజులు గడిచిన తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు పిర్యాదు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నంచర్ల గ్రామానికి చెందిన ఎడ్ల అంకిరెడ్డి (80)అనే వృద్ధుడు ఈనెల 3 న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి రాగా గ్రామస్థులు ఎక్కడికి వెళ్తున్నారని వృద్ధుడిని అడుగగా ఎండు మిరపకాయలు తీసుకురావడానికి వెళ్తున్నానని చెప్పి నేటికీ ఇంటికీ రాకపోవడంతో ఆందోళన చెందుతున్నామని తెలిపారు. అంకిరెడ్డి కోసం బంధువులు, చుట్టూ పక్కల గ్రామాలు, జగిత్యాల పట్టణంలో కుటుంబ సభ్యులు వెతికిన ఆచూకీ లభ్యం కాకపోవడంతో వారం క్రితం పెగడపల్లి పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశామన్నారు. జగిత్యాల నుండి ధర్మపురి రూట్, పెగడపల్లి నుండి మల్యాల, గొల్లపల్లి మీదుగా జగిత్యాల వరకు, కరీంనగర్, తదితర బంధువుల ఇళ్లల్లో అంకిరెడ్డి కోసం వెతికామని తెలిపారు. వృద్ధుడి మానసిక పరిస్థితి బాగా లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన ఆచూకీ ఎవరికైనా తెలిసిన 94417 85156, 78933 95553 అనే నంబర్లకు తెలియజేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# గుండేటి రాజు కు కళా విశిష్ట పురస్కారం

### పురస్కారం అందించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే సంజయ్



జగిత్యాల జూన్12 (ప్రజామంటలు): జగిత్యాలకు చెందిన కళాకారుడు కళాశ్రీ ఆర్ట్స్ థియేటర్ అధినేత గుండేటి రాజుకు ప్రభుత్వం తరుపున పురస్కారం ఆందుకున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సావాల సందర్భంగా నిర్వహిం చిన తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాలకు చెందిన కళాశ్రీ సాహితీ వేదిక అదినేత గుండేటి రాజు ను కళా విశిష్ట పురస్కారంతో జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ లు సన్మానించారు. జిల్లా గ్రంధాలయం చైర్మన్ చంద్ర శేఖర్ గౌడ్, డిసిఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. గుండేటి రాజుకు పురస్కారం రావడం పట్ల జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, అలిశెట్టి రాజు, కందుకూరి నాగరాజు, బూసారపు శ్రీనివాస్ గౌడ్, సంకోజి వెంకట రమణ, దండే గోవర్ధన్, గాజుల నగేష్, అభి, మిష్టర్ తెలంగాణ షావేర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2కే రన్

### ప్రారంభించిన కోరుట్ల ఎమ్మెల్యే



కోరుట్ల టౌన్ జూన్ 12 (ప్రజామంటలు): తెలంగాణ ఏర్పడి పది సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా చేపట్టిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కోరుట్ల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 2కే రన్ ను కోరుట్ల నియోజకవర్గం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఉదయం 6-00 గంటలకు పట్టణం లోని శ్రీ కృష్ణ దేవాలయం వద్ద నుండి నంది చౌక్ వరకు రన్ కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పుడు ఉన్న ఈ కాలంలో శరీర ఆరోగ్యానికి వ్యాయామం, ధ్యానం చేయాలిసిన అవసరం ఉందని సూచించారు. ఆర్డీవో వినోద్ కుమార్, డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యం అని పెద్దలు చెప్పినట్టుగా అందరు కూడా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఈ రన్ యొక్క ఉద్దేశ్యం కూడా అదే అని పేర్కొన్నారు ఈ రన్ లో వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పరిగెత్తారు. ముందుగా వచ్చిన ముగ్గురు మహిళలకు ముగ్గురు పురుషుల కు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం లోమున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య అనిల్, వైస్ చైర్మన్ పవన్ జడ్పీటీసీలు ఎంపీటీసీలు సర్పంచులు, కౌన్సిలర్లు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆత్మీయ కలయిక



కోరుట్లటౌన్ జూన్ 12 (ప్రజామంటలు): పదవ తరగతిలో మేము స్నేహితులం కొన్ని సంవత్స రాల ఎడబాటు తర్వాత మళ్ళీ పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ 1991 బ్యాచ్ విద్యార్థుల ఒక చోట చేరి చదువుకునే సమయంలో చేసిన చిలిపి చేష్టలు, కలిసి చదివిన చదువు గుర్తు చేసుకొంటూ వెంకటపూర్ గుట్ట పైన కలుసుకోవడం జరిగింది. ఈ సమ్మేళనంలో చిన్ననాటి మాటలను గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు. కార్యక్రమంలో కోడూరి రామకృష్ణ (అమెరికా), కల్వకోట చంద్ర ప్రకాష్, అల్లాడి మహేష్, కోలుగూరి శ్రీపతి రావు, ప్రకాష్, నవీన్ కోటేష్, రాజు, వెంకటేష్, హరిప్రసాద్, రవి, శ్రీధర్, శ్రీనివాస్, స్నేహ బృందం పాల్గొన్నారు.

# ఆనందోత్సవాల మధ్య అపూర్వ సమ్మేళనం

- 36 సం.ల అనంతరం కలుసుకున్న మిత్రులు
- చిన్ననాటి స్మృతుల నెమరు
- గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు



**భీమదేవరపల్లి,జూన్ 12 (ప్రజామంటలు):** ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయి. తను చదువుకునే రోజులో చేసే అల్లరి, స్నేహితుల కోసం చేసే ఫైటింగ్ లు, వారితో కలిసి ఆడిన ఆటలు, చిన్న చిన్న గ్యాంగులు అవన్నీ ఓ మధురమైన తీపి జ్ఞాపకాలు. అవన్నీ గుర్తు చేసుకుంటూ సరిగ్గా మూడు దశాబ్దాల తర్వాత (36 సం.ల) కలుసుకొని ఆనందంగా గడిపారు.

**ముల్కనూర్ జెడ్పి ఉన్నత పాఠశాలలో...**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో జెడ్పి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు 1986-87 నాటి తీపి జ్ఞాపకాలను స్థానిక వెంకట సాయి గార్డెన్ లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికగా ఘనంగా నిర్వహించారు.

**గురువులకు సత్కారం:** చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించి, ఆశీర్వాదాలు తీసుకున్నారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమలాంటి ఎంతోమంది విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పించి, తీర్చిదిద్దిన గురువు లను సన్మానించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

**అశ్రునివాళి:** అనంతరం మృతి చెందిన గురువులను, తోటి పూర్వ విద్యార్థులకు నివాళులర్పిస్తూ మౌనం పాటించారు.

**ఆత్మీయ నేస్తాలతో తీపి జ్ఞాపకాలు:** ఆత్మీయ స్నేహితులు కలసిన రోజు పండుగ వాతావరణం ఒకరి బాగోగులు ఒకరు తెలుసుకుంటూ, తమ 36 ఏళ్ల ప్రస్థానం నేస్తాలతో పంచుకునే అరుదైన సమ్మేళనంలో చిన్ననాటి మిత్రులు అలింగనాలు, కరచాలనాలు, స్నేహితులకు పెట్టుకున్న నిక్ నేమ్స్ తో మళ్లీ వాళ్ళను పిలవడం, కల్మషం లేని మనసుతో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు జోకులు వేసుకుంటూ ఆ రోజంతా తమ ప్రాణ స్నేహితులతో గడిపారు. ఆనాటి తన బెంచ్ మెట్లతో ఎంతో చనువుగా ముచ్చటిస్తూ సంతోషంగా గడిపి సందడి చేశారు.

**పాల్గొన్న గురువులు:** సుదర్శన్ రెడ్డి, కోడూరి సరోజన, షేక్ మీరా, శంకర్ రావు, సంపత్ పిఈటి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**చురుకుగా పాల్గొన్న విద్యార్థులు:** అలిగిరెడ్డి సదాశివ రెడ్డి, ప్రభాకర్, రమేష్, కొమురయ్య, చిదురాల శ్రీనివాస్, ఆరుకాల విక్రమ్ కుమార్, మాడుగుల శ్రీనివాస్, సదాలక్ష్మి, అనిత, అశాలత, సంపత్, జి. కొమురయ్య, జోగుల రవీందర్, ముజ్జిక సంపత్, నాగిరెడ్డి, రజనీ, నరెందర్రెడ్డి, సంపత్ లతో పాటు 100 పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# పోలీస్ గ్రీవెన్స్ లో ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ ఎగ్గడి భాస్కర్

### బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం



జగిత్యాల జూన్ 12 (ప్రజామంటలు): ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 22 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ వచ్చిన పిర్యాదులు భూ సమస్యలు, భార్య భర్తల మధ్య విభేదాలు, ఫైనాన్స్, గల్ఫ్ కు పంపిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన సమస్యలపై ఫిర్యాదులు రావడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

# పీఎఫ్ ఉన్నా బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలి



### కలెక్టరేట్ ఎదుట తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్

జగిత్యాల జూన్ 12 (ప్రజామంటలు): రాష్ట్రంలో బీడీ పరిశ్రమ సంక్షోభంలో ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న జీవన భృతిలో పీఎఫ్ నిబంధన లేకుండా అందరికీ జీవనభృతి అందించాలని ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు సామల మల్లేశం డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటియుసి ఆధ్వర్యంలో బీడీ కార్మికుల సమస్యలపై స్థానిక రామాలయం నుంచి ర్యాలీగా వెళ్లిన బీడీ కార్మికులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. తమ డిమాండ్లను అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి, ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు సామల మల్లేశం లు మద్దతు తెలిపారు. అనంతరం చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం దేశంలోని లక్షలాది బీడీ కార్మికుల పొట్ట కొట్టే పనులను చేపట్టిందన్నారు. కుటీర ప్రరిశ్రమగా వర్ధిల్లుతున్న బీడీ పరిశ్రమ పై 28 శాతం జిఎస్టీని విధించి బీడీ పరిశ్రమ ఖాయిల పడేలా చేసిందన్నారు. తక్షణమే కేంద్రం కుటీర పరిశ్రమగా బీడీ పరిశ్రమను గుర్తించి జిఎస్టీని ఎత్తివేయాలని కోరారు. అలాగే జగిత్యాల జిల్లాలో బీడీ కార్మికులు అత్యధికంగా ఉన్నారని వీరి సంక్షేమానికై ఈఎస్ఐ ఆసుపత్రిని నిర్మించాలని చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ముక్రం మాట్లాడుతూ.... రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ 2018 ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 2014 కటాఫ్ ను ఎత్తివేసి పీఎఫ్ ఉన్నా బీడి కార్మికులకు జీవనభృతి ఇస్తామని హామీ ఇచ్చారు. ఏడేండ్లు గడుస్తున్నా హామీ నెరవేరలేదన్నారు. గృహలక్ష్మీ పతకం క్రింద స్వంత జాగా కలిగిన బీడీ కార్మికులందరికి మూడు లక్షల ఆర్థిక సహాయాన్ని ఐదు లక్షలకు పెంచాలని ముక్రం కోరారు. కేంద్ర పీఎఫ్ సంస్థ నుంచి రాజీనామా చేసిన బీడీ కార్మికులకు ఆరు వేల రూపాయల కనీస పెన్షన్ ఇవ్వాలన్నారు. సత్వరమే బీడీ కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి ముక్రం కోరారు. ఈ కార్యక్రమంలో బీడీ వర్కర్స్ రాష్ట్ర నాయకులు సూతారి రాములు, కొక్కుల శాంత, ఇరుగురాల భూమేశ్వర్, కిరణ్, అథిక్, ధర్మయ్య, రాజగంగు, అక్రమ్, శ్రీను, అందే రామయ్య, మహేష్, బీడీ టేకేదారుల సంఘం నాయకులు వెంకన్న, వెన్న సురేష్, చెన్న విశ్వానాథమ్ తో పాటు వందలాదిగా బీడీ కార్మికులు పాల్గొన్నారు.

# నాలుగవ రోజూ లలితా సహస్ర నామ పారాయణం



జగిత్యాల జూన్ 12 (ప్రజామంటలు): గోవింద్ పల్లి మోతే శివారు ప్రాంతం నవ దుర్గా నగర్ లో నిర్మించబడిన నవదుర్గ అమ్మవారి స్వస్థానంలో స్థాపింపబడిన నవ దుర్గా పీఠం వద్ద ఆరు రోజుల పాటు జరుప తలపెట్టిన అఖండ శ్రీ లలితా సహస్రనామ పారాయణం సోమవారం నాలుగో రోజుకు చేరింది. వందలాది మంది భక్తులు షిఫ్టులవారీగా పీఠం వద్దకు చేరుకొని సామూహిక శ్రీ లలితా సహస్ర నామ పారాయణం చేస్తున్నారు. ఈ సామూహిక లలితా సహస్ర పారాయణం ప్రభావం వల్ల అతి త్వరలోనే ఆలయం పూర్తవుతుందని, నిర్వాహకులు తెలిపారు. ఈ ఆలయానికి 44 గుంటల స్థలం సేకరించామని, 15 మంది కార్యవర్గం అంకితభావంతో పనిచేస్తు న్నామని, ఆలయానికి భూమి పూజ జరిపి, చండీ హోమం కూడా చేశామని, నిర్వాహకులు తెలిపారు. అంగరంగ వైభవంగా జరుగుతున్న శ్రీ లలితా సహస్రనామ పారాయణం ఆ ప్రాంతం అంతటిని ఎంతో ప్రభావితం చేస్తుంది. ఆధ్యాత్మికతతో ఆ ప్రాంతమంతా ఎంతో శోభను సమకూర్చుకుందని, పారాయణంకు వచ్చే భక్తులకు వాహనాలు కూడా సమకూర్చి వారిని ఇండ్లకు చేర్చడం జరుగుతుంది. భక్తులకు ఉదయం అల్పాహారం, పగలు భోజనం, సాయంత్రం అల్పాహారం, వారికి అవసరమైన స్నాక్స్, చాయ్, కాఫీ, అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆ ప్రాంతం అంతా ఆధ్యాత్మిక శోభతో విరాజల్లు తుంది అనడంలో అతిశయోక్తి లేదు. ఈనాటి కార్యక్రమంలో ఆలయ కార్యకర్తలు, నిర్వాహకులు, మాతలు, భక్తులు పాల్గొన్నారు.

# బ్రహ్మదేవునితో సమానమైన వృత్తి కుమ్మరి వృత్తి



### కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి

జనగామ జూన్ 12 (ప్రజామంటలు): జనగామ జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో కుమ్మరి శిక్షణ తరగతులు సోమ వారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి మాట్లాడుతూ.... బ్రహ్మ దేవునితో సమానమైన వృత్తి కుమ్మరి వృత్తి అని అన్నారు. మానవ జననం నుండి మరణించే వరకు కుమ్మరి వృత్తిదారులు చేసే మట్టి కుండలు ఎంతో అవసరమని అన్నారు. ప్రభుత్వాలు కులవృత్తిలను కుటీర సంస్థలను ప్రోత్సహిం చాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. కుల వృత్తులను పోషించే విధానంలో కెసిఆర్ చేస్తున్న కృషి అభినందనీయం అని అన్నారు. జనగామ పట్టణ కుమ్మరి సంఘం అధ్యక్షులు మడికొండ నరసింహులు, జిల్లా కన్వీనర్ ఏనుగుతల సోమేశ్వర్, జనగామ పట్టణ ఉత్తిదారుల అధ్యక్షుడు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# రేణుక ఎల్లమ్మ విగ్రహా ప్రతిష్టాపన వేడుకలు



కోరుట్ల రూరల్ జూన్ 12 (ప్రజామంటలు): మండలంలోని పైడిమడుగు గ్రామంలో సోమవారం నుండి వారం పాటు నిర్వహించే శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం ప్రారంభమైంది, ఉదయం మంగళ వాయిద్య గంగా సేకరణ చాలా ప్రవేశం అలాగే ప్రజారోహణం విగ్రహ ఊరికి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గణపతి గౌరీ పూజ, పుణ్యా వచనం, రక్షాబంధనం, అఖండ దీపారాధన, పంచచార్య పంచ పాలిక, నవగ్రహ, మాతృక, సర్వతో భద్రమండల చతుసస్తి యోగిని మండల ఆరాధన ప్రధాన కలశ స్థాపన అగ్ని ప్రతిష్ట విగ్రహ అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో మంటఆరాధనలు, గణపతి హోమం దుర్గాసూక్త మన్యశుక్త రుద్రహోమం నిర్వహించారు. గీతా కార్మికుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్ర మంలో గీతా పారిశ్రామిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# జనగామలో బంజారా భవానాన్ని ఏర్పాటు చేయాలి



జనగామ జూన్ 12 (ప్రజామంటలు): జనగామ జిల్లా కేంద్రంలో బంజారా భవానాన్ని ఏర్పాటు చేయాలని, దశాబ్ద ఉత్సవా ల్లో భాగంగా 17 తేదీన గిరిజన ఉత్సవాల సందర్భంగా సేవాలాల్ మహా రాజ్ జయం తిని నిర్వహించాలని, ఫిబ్రవరి 15న సెలవు దినం ప్రకటించాలని సేవా లాల్ సేన జిల్లా అధ్యక్షులు ధారావత్ శంకర్ నాయక్ సోమ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్ప టివరకు జిల్లా కేంద్రాలలో బంజారా భవన్లో ఏర్పాటు చేయకపోవడమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభు త్వం దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గిరిజన ఉత్స వాలు జరుపుకోవాలని చెప్పడం గిరిజన సంస్కృతి విభిన్నంగా సందర్భం లేకుండా పండుగలు జరుపుకోవాలనడమే గిరిజనుల మనోభావాలు దెబ్బతీయటమని, సంస్కృతిని అలవాటు చేసే విధంగా ఉండాలని, సంస్కృతిని దెబ్బతీసే విధంగా నిర్ణయాలు తీసుకుంటూ ప్రభుత్వం వ్యవహరిస్తొందని ఆరోపించారు.

# కలెక్టర్ ఆవరణలో ఆమరణ దీక్షకు సిద్ధమైన నంచర్ల గ్రామవాసి



జగిత్యాల జూన్ 12 (ప్రజామంటలు): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నంచర్ల గ్రామానికి చెందిన రాజేష్ అనే వ్యక్తి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టాడు. పెగడపల్లి మండలం నంచర్ల గ్రామానికి చెందిన గొర్రె రాజేష్ అనే వ్యక్తికి చెందిన 20 గుంటల భూమి విషయంలో అదే గ్రామానికి చెందిన మర్రిపల్లి సత్యం, నేరెళ్ల తిరుపతి అనే ఇద్దరు వ్యక్తులు గొడవ పెట్టుకొని బూతులు తిట్టారని, పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేసాడు. కలెక్టర్ స్పందించి వారి పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసేంత వరకు కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని అన్నాడు.

# విపక్షాల ఐక్యతను పట్టించుకోని కాంగ్రెస్

సార్వత్రిక ఎన్నికలకు మరో ఏడాది మాత్రమే గడువుంది. వచ్చేఎన్నికల కోసం ప్రధాన పక్షాలు ఇప్పటి నుంచే కసరత్తు మొదలు పెట్టాయి. బిజెపి మోడీ విజయాలపై సభలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో అమిత్‌షా, నడ్డాలు ఎపిలో పర్యటించి అధికార వైసిపిని ఎండగట్టారు. వైసిపి అవినీతిపై ఘాటుగా విమర్శలు చేశారు. కానీ కేంద్రం చేసిన తప్పులను మాత్రం ప్రస్తావించలేదు. విభజన సమస్యలపై ఎలాంటి మాటా మాట్లాడలేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకత్వంలో విపక్షలు చేస్తున్నా ఐక్యతా ప్రదర్శనలు ఓ కొలిక్కి రాలేదు. రాహుల్ అమెరికాలో పర్యటిస్తూ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అంటూ ప్రసంగాలు చేస్తున్నారు. కాంగ్రెస్‌లో అధ్యక్షుడిగా మల్లికార్జున ఖర్గే ఉన్నా.. పెత్తనం అంతా సోనియా కుటుంబానిదే అని చెప్పవచ్చు. నితీశ్ కుమార్ విపక్షాల ఐక్యతకు చేస్తున్న ప్రయత్నాలు ఇంకా పునాది దశలోనే ఉన్నాయి.

రాహుల్ కూడా నాయకత్వ పటిమను ప్రదర్శించలేకపోతున్నారు. విపక్షాలను ఏకతాటిపైకి తీసుకుని రావడంతో పాటు, ప్రజా సమస్యలపై పోరాడడంలోనూ కాంగ్రెస్ వైఫల్యం కారణంగా మోడీ విశ్వరూపం ప్రదర్శిస్తున్నారు. తనకు ఎదురులేనట్లుగా పాలన సాగిస్తున్నారు. బిజెపిలో కూడా తనకు ఎదురులేకుండా మోడీ ముందుకు సాగుతున్నారు. దీనికి కాంగ్రెస్‌లో నాయకత్వ లోపమే కారణంగా చెప్పుకోవాలి. దీనికి తోడు పార్టీలో ఉన్నా నాయకత్వ లోపంతో పార్టీ నుంచి ఒక్కొక్కరే జారుకుంటున్నారు. పార్టీ గత చరిత్ర, వారసత్వ రాజకీయాల కారణంగా పార్టీని నడపలేమని సీనియర్లు ఎప్పటినుంచో చెబుతూనే ఉన్నారు. రాహుల్ కాకుండా ప్రియాంకకే పార్టీ బాధ్యతలను అప్పగించాలన్న భావన ఇప్పుడిప్పుడే బలపడుతోంది. అయితే ఖర్గే కూడా ఛరిష్మా కలిగిన నేత కాదు. అలాగూ వ్యూహకర్త అంతకన్నా కాదు. కర్నాటకలో గెలవడంతో ఇక అంతా తమదే విజయం అన్న ధీమాలో కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

అయితే పివి నరసింహా రావు లాంటి లీడర్ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి అవసరం. వ్యూహాలు అమలు చేయగల దిట్టకావాలి. ముందుగా పార్టీలో ఉన్న నేతలకు, కార్యకర్తలకు నమ్మకం కలిగించేలా నాయకత్వాన్ని రూపొందించు కోవాలి. కానీ అలా చేయడం లేదు. గత అనుభవాల నుంచి రాహుల్ పాఠాలు నేర్చుకోవడం లేదు. పార్టీని సమర్థంగా నడిపించలేని పార్టీగా కాంగ్రెస్ మిగిలి పోతోంది. కరోనా సంక్షభం కావచ్చు... పెట్రోల్ ధరలు కావచ్చు, బ్యాంకుల లూటీ కావచ్చు..ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలు కావచ్చు..మోడీని నిలదీసే సత్తాలో ప్రస్తుత కాంగ్రెస్ నాయకత్వం లేదు. దీనికితోడు పార్టీలో ఉంటే లాభం లేదనుకున్న వారు జారుకుం టున్నారు. ఇది కాంగ్రెస్ అంతర్గ సంక్షభానికి నిదర్శనంగా చూడాలి. కాంగ్రెస్‌తో ఉన్న బంధాన్ని తుంచేసు కొని అనేకులు బీజేపీలో చేరారు. ఇకముందు కూడా చేరనున్నారు. సంస్థాగతంగా బీజేపీ ఒక్కటే జాతీయ పార్టీ అనీ, మిగతా పార్టీలన్నింటికీ అటువంటి లక్షణాలు లేవని అంటున్నారు. అందుకే మోడీ నాయకత్వం అందరినీ ఆకర్శిస్తుందనడంలో సందేహం లేదు. మోదీ నాయకత్వం పట్ల ప్రజలు కూడా ఆశాభావంగా ఉన్నారు. బిజెపిలో పరిస్థితులు ఎలా ఉన్నా కాంగ్రెస్‌లో మాత్రం ఆశాజనకంగా లేవనే చెప్పాలి.

ఈ పార్టీ అధికారంలోకి వస్తుందన్న నమ్మకం కేంద్రంలో కానీ, రాష్ట్రంలో కానీ లేకుండా పోయాయి. కేవలం వారసత్వం, గత చరిత్రపై ఆధారపడితే విజయం సాధించ లేమని కొందరు నేతలు నిర్మొహమాటం గానే ప్కటించారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆత్మావలోకనం చేసుకోవాల్సి ఉంది. ఎన్నికల్లో విజయం సాధించాలంటే పార్టీకీ శస్త్ర చికిత్స అత్యవసరమని అంటున్నారు. శస్త్ర చికిత్స చాలా ఆలస్యమైందని, ఇది ఇప్పటికిప్పుడే అవసరమని, రేపటికి వాయిదా వేయకూడదని గుర్తించాలి. కాంగ్రెస్ తన వ్యూహాలను పునరాలోచించుకోవాల్సి కూడా ఉంది. సమర్థులు కానివారికి పదవులు ఇవ్వవద్దని, పార్టీని పునర్వ్యవస్థీకరించాలని కోరుకుంటున్నారు. ఈ ఏడాది కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నా యని.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నిలదొక్కుకోక పోతే.. 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో మరింత కష్టమవుతుందని నిర్మొహమాటంగానే హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్ కేవలం వారసత్వంపై ఆధారపడకూడదని, ప్రధాని మోడీ చేస్తున్న పోటాపోటీ రాజకీయాలకు తగినట్లుగా మనల్ని మనం తీర్చి దిద్దుకోవాల్సి ఉందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. మోడీని ఓడించడం సాధ్యం కాని విషయమేమీ కాదని, కాంగ్రెస్‌ను గాడిలో పెడితే మోడీని ఓడించవచ్చని అంటున్నారు.

దానికి తగినట్లుగా పార్టీలో మార్పులు చేయాలని, వాయిదా వేయకూడదని హితవుపలికారు. కాంగ్రెస్ తాజా పరిస్థితుల ఆధారంగా ఆత్మవలోకనం చేసుకుంటుందా లేదా అన్నది చూడాలి. మాయావతి పార్టీ మరింత బలహీనంగా ఉన్న తరుణంలో, న్నికలనాటికి కాంగ్రెస్ మరింత నీరసించిన పక్షంలో మరింత నష్టపోయే అవకాశమూ ఉంది. అది బీజేపీకి మేలు చేస్తుంది.

రాహుల్ మీద ఆశలు పెట్టుకున్న వారికి ఆయనకానీ, పార్టీకానీ మంచికాలం ముందున్నదన్న హామీ ఇవ్వనంతకాలం నిష్క్రమణలు జరిగిపోతూనే ఉంటాయి. అయితే కర్నాటక ఉత్సాహంతో ఉన్న కాంగ్రెస్ దాని ఫలితాలను ఎలా ఉపయోగించుకోవాలో కసతరత్తు చేయాలి. దేశమంతా ఇదే ఫార్ములా పనిచేస్తుందన్న భావన సరికాదు.

## ఆదరణ కరువైన అపురూప దేవాలయం

### సాధ్వీమణి పాతివ్రత్యానికి నిలువెత్తు సాక్షిభూతం

**ధర్మపురి జూన్ 12 (ప్రజా మంటలు) :** భారతీయ ప్రాచీన సంస్కృతికి, హైందవ సనాతన సాంప్రదాయాలకు పట్టుకొమ్మగా నిలిచి, ప్రధానంగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల త్రైమూర్త్య నిలయమై, వరదాయినియై, భక్తి ముక్తి ప్రదాయినియై, పరమ పావనియైన పవిత్ర గోదావరినదీ తీరాన వెలసి, పౌరాణిక, ఐతిహాసిక, చారిత్రిక ప్రాధాన్యత సంతరించు కుని, హిందూ ముస్లిం మత సామరస్యానికి అనాదిగాప్రతీకగా, దక్షిణ కాశిగా, హరి హర క్షేత్రంగా, నవనారసింహ క్షేత్రాలలో నొకటిగా రాష్ట్రంలో వాసికెక్కి, నిత్య భక్త జన సందడితో, నిరంతర దైవ నామ స్మరణలతో విరాజిల్లుతున్న పవిత్ర తీర్థం - ప్రాచీన ధర్మపురి పుణ్య క్షేత్రం. రాష్ట్రంలోనే గాక, వేరెచ్చటనూ లేని విధంగా, ఈ క్షేత్రంలో గల దేవాలయాలు, ఒక్కొక్కటి ప్రత్యేక ప్రతిపత్తిని, ప్రత్యేకతను, వైశిష్ట్యాన్ని కలి గియుండడం విశేషం. అలాంటి ఆలయాలలో అత్యంత వైశిష్ట్యాన్ని సంతరించుకుని, పౌరా ణిక, చారిత్రక నేపథ్యాన్ని కలిగిన పతివ్రతా శిరోమణి అయిన సత్యవతీ దేవి ఆలయం, ఆ సాధ్వీమణి పాతివ్ర త్యానికి నిలువెత్తు సాక్షి భూతంగా నిలిచిన సైకత (ఇసుక) స్థంభం, దేశంలో వేరెక్కడా లేని విధంగా శివ పాన వట్టం మీద నారసింహ విగ్రహం కలిగి శివకేశ వాద్వైత సాంప్రదాయానికి ప్రతీకయైన ఆరు దైన విగ్రహాలు నిరాదరణ నీడలో మగ్గుతున్నాయి. ఒకనాడు మహోజ్వలంగా వెలుగొంది సనాతన హిందూ స్త్రీల ధర్మాచరణ సాంప్రదా యంలో భాగంగా, నారీలోకానికి ఆదర్శ మూర్తిగా నిత్య పూజలనందుకున్న సత్యవతీ దేవి ఆదరణ కరువై, నిర్లక్ష్యానికి గురవుతు న్నది. వేదవ్యాస విరచితంగా భావించబడే బ్రహ్మాండ, స్కాందాది పురాణాంతర్గతమైన ధర్మ పురి క్షేత్ర మహాత్మ్యం గ్రంథంలో సత్యవతీదేవి పాతివ్రత్య వృత్తాంతం వర్ణించబడింది. నైమి శారణ్యంలో, శౌనకాది మహర్షులకు, సూత పౌరాణికుడు వివరించిన ప్రకారం, నారద మహర్షి పృథు చక్రవర్తికి చెప్పిన విధంగా, పూర్వము సిందు దేశమును పాలించిన వీరసేనుడను రాజు ఆజ్ఞ ప్రకారం జయుడను ఆయన పురోహితుడు, యుక్త వయస్కు రాలైన రాకుమారికి, సర్వలక్షణ సమన్వితుడైన రాకు మారుని వరునిగా చేయ సంకల్పించి, ఎన్నో దేశాలు తిరిగి చిత్ర పటములు తెచ్చినా, ఆమె మెచ్చకుండిన కారణంగా విసుగుచెంది, మంత్రోపాయము చేత ఒక సర్పమును బంధిం చి తెచ్చి, పేటికయందుంచి, కులాచార ప్రకా రం, వరుని చూడకయే యుక్త సమయమున వివాహమాడమని చెప్పి, దేశము వదలి వెడలి పోయెను. వివాహ ముహూర్త సమయంలో పేటిక తెరచి, భయంకర సర్పమును గాంచి, జరిగిన మోసమును గ్రహించి, వచన బద్ధు రాలై, రాకుమారి పామునే తన భర్తగా స్వీకరిం చెను. ఆ సర్పమును కంఠమున ఉత్తరీయము వలె ధరించి, భగవదనుగ్ర హామునకై తీర్థయాత్రల కేగి, పుణ్య క్షేత్రములను తిరుగుతూ, దండకారణ్యమందలి పుణ్యభూమి యగు ధర్మపురికి ఏతెంచి, పవిత్ర గౌతమీ జలా లలో సర్పముతోకూడి స్నానమాచరించెను. తక్షణమే సర్పము దివ్య పురుషునిగా మారెను. ప్రజలందరి సంశయమును తీర్చి, పాతివ్రత్య నిరూపణకై మూడు ముష్టుల ఇసుకను పిడికి లితో పోయగా, ఆ ప్రదేశమందు సైకతము ఇసుక స్థంభముగా మారెను. రాజకుమారి విజ య సత్యవతి యని పాతివ్రత్య మహిమకా రణంగా సార్థక నామధేయురాలు కాగా, ఆ మహాసాధ్వి స్నాన మాచరించిన స్థలము సత్య వతీ కుండము అని నామాంకితయ య్యెడు. అనంతర కాలంలో, సత్యవతీ కుండములో స్నాన మాచరించి, ఆమె దర్శనం చేసుకుని, స్థానిక ఇలవేలుపైన శ్రీనృసింహుని మందిరానికి వెళితే, ఒక్కొక్క పాదమున ఒక్కొక్క అశ్వమేధ యజ్ఞ ఫలం లభించునట్లు వరములు పొందెనని స్థల పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఇక చారిత్రిక అంశానికొస్తే స్థానిక ఓరియంటల్ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రాచార్యులు, చారిత్రక పరిశోధకులు, బహుభాషావేత్త డాక్టర్ సంగనభట్ల నర్సయ్య చారిత్రిక పరిశోధనల ఫలితంగా ఇది అపురూపమైన హరిహరనాథ ఆలయంగా భావించబడుతున్నది. శివ, కేశవులకు అభేదాన్ని పాటించే హరి హర క్షేత్రంలోని ఈఆలయంలో భారతదేశంలో వేరెచ్చటనూ కానరాని విధంగా పానవట్టం మీద నారసింహుని విగ్రహం ఉండడం విశేషం. 11వ శతాబ్దికి చెందిన ఈ ఆలయం మొదట శివాలయమని, తరువాత నారసింహాల యమని, ప్రస్తుతం సత్యవతి అలయమని డాక్టర్ నర్సయ్య పరిశోధన ద్వారా తేల్చి చెప్పారు. ఇక్కడి స్తంభం చాళుక్యుల కాలంనాటి విజయ స్థంభమని పేర్కొన్నారు. ఆరు అడుగుల ఎత్తుగా వితర్దిక కట్టి, దానిపై ఆలయం నిర్మితమైంది. ఆలయ గర్భంనుండి కప్పును చీల్చుకుని అత్యంత ఎత్తుగా నిలిచిన స్థంభము నా నుకునే పాన వట్టం, దానిపై లింగం స్థానంలో నరసిం హుని విగ్రహం ఉంది. దీని పక్కగా పడగ నీడలో లక్ష్మీనారా యణ విగ్రహం ఉంది. కుడిప క్కన నూనె కారుతున్నంత నునుపుగా అమ్మ వారి విగ్రహం ఉంది. ఆళ్వారుల విగ్రహాలూ ఉన్నాయి. ఆలయ ప్రవేశంలో రెండు ఆంజనే యస్వామి విగ్రహాలు ఎదురెదురుగా ఉన్నాయి. ద్వార బంధంపై శేషసాయి విష్ణుమూర్తి విగ్రహ ముంది. ఇంతటి ప్రాధాన్యతను కలిగిన సత్యవతీ ఆలయం తదంతర్గత ఇసుకస్థంభం, ఆలయం లోని అరుదైన విగ్రహాలు ప్రస్తుతం ఆదరణలేక శిథి లావస్థకు చేరుకున్నాయి. బ్రహ్మపుష్కరిణికి ఎత్తయిన ప్రదేశంలోగల సత్యవతీ ఆలయాన్ని ఇటీవల







(రామ కిష్టయ్య సంగన భట్ల)
94405 95494

స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ చొరవ ఫలితంగా, రాష్ట్ర దేవాదాయ శాఖ స్వాధీన పరుచుకుని, శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థా నానికి అనుబంధంగా, ప్రత్యేక నిధుల తో, క్షేత్ర ప్రాధాన్యతను ఇనుమడింప జేస్తూ, సనాతన ఆలయాలను పునరుద్ధరించే చర్యలు గైకొనే చర్య లు గైకొన బడు తున్నాయి. 20లక్షల ప్రత్యేక నిధులతో పునర్నిర్మాణ పనులు మంజూరి అయి, టెండర్లు పిలిచారు.

## జగనన్న విద్యాకానుక ప్రారంభం

### అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు జగన్ హెచ్చరిక

పల్నాడు,జూన్12 : జగనన్న విద్యాకానుకను సిఎం జగన్ లాంఛనంగా పల్నాడు క్రోసూరు స్కూల్‌లో ప్రారంభించారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలో బడులు తెరిచిన తొలిరోజే జగనన్న విద్యాకానుక ఇచ్చారు. నాలుగో విడత 'జగనన్న విద్యాకానుక' కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని పల్నాడు జిల్లా క్రోసూరులో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలతో పాటు వారి బెంచ్‌పైనే కూర్చొని కాసేపు సరదాగా సంభాషించారు. పిల్లలందరికీ విద్యాకానుక కిట్లు అందజేశారు. పిల్లలతో సెల్ఫీలు దిగి వారిని ఆనందంలో ముంచెత్తారు. ఇక వెళ్తూ వెళ్తూ.. బోర్డుపై 'ఆల్ ది బెస్ట్ స్టూడెంట్స్' అని రాశారు. ఆ తర్వాత పెదకూరపాడు నియోజకవర్గంలో రూ.217కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన చేశారు. తొలుత విద్యార్థులతోపాటు తరగతి గదిలో కూర్చొన్న జగన్.. కాసేపు వారితో ముచ్చటించారు. ఎపిలోని పాఠశాలలు పున: ప్రారంభం కానున్న నేపథ్యంలో ... ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మాట్లాడుతూ ... ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించేందుకు ఈ నాలుగేళ్లలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే రోజునే విద్యాకానుక అందిస్తున్నామని తెలిపారు. బిజెపి తనకు అండగా ఉండకపోవచ్చని.. తాను వాళ్లని నమ్ముకోలేదని సిఎం స్పష్టం చేశారు. ఈ కురుక్షేత్ర సంగ్రామంలో ప్రజలే తన సైన్యమని అన్నారు. మీ ఇంట్లో మంచి జరిగిందా ? లేదా ? అనేదే కొలమానంగా తీసుకోవాలని కోరారు. మంచి జరిగితే అండగా నిలవాలని జగన్ విజ్ఞప్తి చేశారు. పేదపిల్లల చేతుల్లో ట్యాబులు కనిపిస్తే ఓర్వలేని బుద్ధి చంద్రబాబుదని అన్నారు. అన్నింట్లోనూ.. పేదల పట్ల వ్యతిరేకత బుద్ధి ప్రదర్శించారనీ, అందుకు కారణం ఆయనలోని పెత్తందారీ మనస్తత్వమని చెప్పారు. చంద్రబాబు గత ఎన్నికలకు ముందు ఎన్నికల తరువాత మోసం చేశారని జగన్ విమర్శించారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి తేడా గుర్తించాలని కోరారు. అవినీతి, వివక్షకు తావులేకుండా నేరుగా లబ్దిదారులకు సంక్షేమం అందించిన ప్రభుత్వం వైసిపి అని స్పష్టం చేశారు. అక్కచె÷-లెమ్మల దగ్గరి నుంచి అన్ని వర్గాలకూ లబ్ది చేకూరుస్తున్నామన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన అన్ని హామీలను అమలు చేస్తున్నామన్నారు. కానీ...చంద్రబాబు బతుకే మోసం, అబద్ధం, కుట్ర, వాగ్దానాలు, వెన్నుపోటులు అని... అన్నారు. ఈ గజదొంగల ముఠా ఆయనకు అండగా వస్తోంది. మూసేయడానికి సిద్ధంగా ఉన్న టిడిపి దుకాణంలో పక్కరాష్ట్రం నుంచి మేనిఫెస్టో తీసుకొచ్చి.. బిసిబిల్లాబాత్‌గా వండుతున్నారు. మనం చేసిన మంచిని, అందిస్తున్న సంక్షేమ పథకాలను కిచిడీ, పులిహోరగా వండే ప్రయత్నం చేస్తున్నారు. సిఎం అయిన 28 సంవత్సరాల తర్వాత.. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చంద్రబాబు చేసిన తర్వాత రాయలసీమ, బీసీ, ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్‌లు అంటూ ఇవాళ మొదలుపెట్టారు. ఆ 14 సంవత్సరాలు ఏం గాడిదలు కాసావా చంద్రబాబు ? ' అని సిఎం జగన్ అన్నారు.

## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం




"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్ " లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విష యాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు....

-ఎడిటర్

## మారాల్సిన మనుష్యులు

**-డా॥కందేపి రానీప్రసాద్**



ఆఫీసు నుంచి బయటకు వచ్చి భర్త కోసం ఎదురు చూస్తూ నిలబడింది రమ. స్కూటర్ వచ్చి ఆగగానే మహేష్ వెనక ఎక్కి కూర్చుంది. స్కూటర్ కొంత దూరం పోగానే రోడ్డు మీద ఒక గుంపు కనపడింది. ఒక సైకిల్, స్కూలు బ్యాగ్ పడిపోయి ఉన్నాయి. ఏంటో చూద్దామని మహేష్ బండి స్లో చేసాడు. 'ఇంటి దగ్గర చాల పని ఉందండి ఇప్పుడు ఆపకండి' అన్నది రమ. 'ఏదో యాక్సిడెంట్ లా ఉంది రమ' ! ఏమైందో చూద్దాం స్కూలు బ్యాగు కనిపిస్తున్నది అంటే "స్కూలు కుర్రాడికి ఏదో అయినట్లుంది ఎవరో ఏమిటో చూద్దాం అంతే" అంటూ ముందు కెల్ల బోయాడు మహేష్. అతని చెయ్యి పట్టుకుని ఆపింది రమ. ఏమండీ ఇంటిదగ్గర బాబు పాప ఎదురు చూస్తుంటారు స్కూలు నుంచి వచ్చి, వాల్లకేదన్నా టిఫిన్ చేసి పెట్టాలి. ఉదయం కూడా సరిగ్గా పెట్టలేదు. యాక్సిడెంట్ అంటే పరిస్థితి ఎలా ఉందో ? ఈ రోజుల్లో ఎవరి గురించి ఎవరు పట్టించుకుంటున్నారు, పోదాం రండి ! అన్నది రమ. అది కాదు రమ ! 'మనమేదో సహాయం చేస్తున్నామని కాదు, కనీసం ఏం జరిగిందో తెలుసుకుంటే పోయేదేముంది, జాలి పడటం తప్ప మనమేం చేస్తున్నాం' అన్నాడు మహేష్. రమ మొహంలోని అనాసక్తతను చూసి ముందుకు వెళ్ళలేక స్కూటర్ స్టార్ట్ చేసాడు.మహేష్, రమ వెళ్ళేసరికి పిల్లలు లాన్ లో ఆడుకుంటున్నారు. అదొక పెద్ద అపార్ట్ మెంటు. మూడు నాలుగు బ్లాక్ లున్నాయి. పిల్లలు ఆడుకోవడానికి పార్కు, పెద్దవాళ్ళు వాకింగ్ చేయడానికి కావలసినంత స్థలం, కిరాణా షాపు, కూరగాయల షాపు అన్నీ ఉన్నాయి. అన్ని సదుపాయాలు ఉన్నాయనే మహేష్, రమ చాలా ఇష్టపడి లక్షలు పోసి కొనుక్కున్నారు. తామిద్దరు ఆఫీసు నుంచి గంట అటో ఇటో గా వచ్చినా కూడా పర్వాలేదు. పిల్లలు ముందోచ్చినా లాన్ లో, పార్కులో మిగతా పిల్లలతో ఆడుకోవచ్చు. సాయం సమయం కాబట్టి చాలా మంది ఇళ్ళలోని ఆడవాళ్ళు కూడా వాకింగ్ చేస్తూ ఉంటారు.గేటు దగ్గర సెక్యూరిటీ, సిసిటివి కెమెరాలు ఉంటాయి. కాబట్టి అసలు బయపడాల్సిన పనేలేదు. ఎంతో నచ్చాక గానీ వాళ్ళు ఈ ఇల్లు కొనడానికి ముందుకు రాలేదు. ఇక్కడికి వచ్చాక మహేష్, రమ పిల్లల విషయంలో ఎంతో ఊపిరి పీల్చుకున్నారు. అమ్మా, నాన్నను చూడగానే పిల్లలు పరిగెత్తుకుంటూ వచ్చేసారు. పిల్లల్ని తీసుకొని ఇద్దరు ఇంట్లోకి నడిచారు. రమ పిల్లలక్కావాలిసిన టిఫిన్ల తయారీలో పడిపోయింది. మహేష్ పిల్లల పుస్తకాలు చూసి హోం వర్కులు ఏం ఉన్నాయో పిల్లల్నడిగి తెలుసుకుంటున్నాడు. పిల్లలు ఉత్సాహంగా టివి చూస్తూ, అమ్మ పెట్టినవి తింటూ స్కూలులో జరిగిన విశేషాల్ని చెబుతున్నారు.ఈ రోజు ఆదివారం కావడంతో అందరూ ఇంట్లోనే ఉన్నారు. మహేష్, రమలకు పదేళ్ళ సాత్విక్, ఆరేళ్ళ శ్రియ తో పాటు ఇంట్లో మహేష్ అమ్మ కూడా ఉన్నది. సాయంత్రం కావడంతో అందరూ దిగి కిందకు వచ్చారు. మహేష్ 'ఇప్పుడే బజారు దాకా వేళ్ళొస్తానంటూ' బయటకు వెళ్ళాడు. రమ అత్తగారు పక్క ఫ్లాట్ లోని పెద్దావిడతో మాట్లాడుతూ 'నేనిక్కడ కూర్చుంటాను, నువ్వు వాకింగ్ చేయమ్మా' అన్నది. సాత్విక్, శ్రియలు మిగతా పిల్లలతో కలసి ఆటల్లో మునిగారు. ఇంక రమ చెవుల్లో ఇయర్ ఫోన్స్ పెట్టుకొని పాటలు వింటూ వాకింగ్ చెయ్యసాగింది.కాసేపు తర్వాత ఏ బ్లాక్ ముందున్న కరెంటు స్థంభం దగ్గర పిల్లా పెద్దా గుమి కూడి కనిపించారు. నాలుగైదు రోజులుగా కరెంట్ స్థంభం దగ్గర వైర్లు వేలాడుతున్నాయని అసోసియేషన్ వాళ్ళు కంప్లైంటు ఇచ్చారు. బహుశా వాళ్ళు రిపేరు చేస్తున్నారేమోలే అనుకోని ముందుకు సాగింది. కాసేపు వాకింగ్ చేసి చెట్ల మధ్య సిమెంటు బెంచీ పై కూర్చుంది.కాసేపటికి మహేష్ పరిగెత్తుకు వస్తుండటంతో తనూ గాభరా పడి ముందుకు వచ్చింది. మహేష్ ఆ గుంపు దగ్గరికి పరిగెత్తాడు. గుంపును తప్పుకొని లోపలికి వెళ్ళేసరికి సాత్విక్ విగతా జీవిగా పడి ఉన్నాడు అలా చూడటంతోనే రమ గుండెలు బాదుకుంటూ ఏడ్చింది సాత్విక్ ను గుండెకు హత్తుకుంది. చల్లగా తగిలాడు, ఏమైంది నా చిట్టి తండ్రికి, ఏడుస్తూ అక్కడున్న వారివంక చూస్తూ అడిగింది. "ఆ కరెంటు స్తంభానికి హై కరెంటు వచ్చినట్లుంది. సాత్విక్ ఆ స్తంభాన్ని పట్టుకోగానే దానికి అతుక్కుపోయాడు. నేనొచ్చి కర్రతో కొట్టి పడేసేసరికి కొస ప్రాణంతో ఉన్నాడమ్మా. నేను నేను ఎంత అరిచినా ఎవరు వినిపించుకోలేదు, ఎవరూ దగ్గరికి రాలేదు. మీ కోసం కూడా చుసానమ్మా" అంటూ సెక్యూరిటీ గార్డు చుక్కమ్మ చెప్పింది."అయ్యో నేనిక్కడే ఉండి కూడా ఇంతా జరుగుతున్నా చూడ లేకపోయానే" అంటూ రమ ఏడుస్తుంటే, చూసేవాళ్ళకూ గుండె బరువెక్కింది. "అప్పుడే హాస్పిటల్ కు తీసుకెళ్తే బతికేవాడేనేమోనమ్మా ఎవరూ నా దగ్గరకు రాలేదు"అంటూ మరల చుక్కమ్మ చెప్పింది.మహేష్ ఉదాసీనంగా రమ వంక చూశాడు. ఎవరెటు పోతే నాకెందుకులే అని అందరూ అనుకోబట్టే ఇలాంటివి జరుగుతున్నాయి. రోడ్డుమీద యాక్సిడెంట్ అయితే వాళ్ళెవరో నాకెందుకు నేనింటికి త్వరగా వెళ్ళాలి అనుకుంటూ అందరూ వెళ్ళిపోతున్నారు. ఏమిటీ సమాజం. ఎటుపోతోంది అని మనసులో అనుకుంటూ బాధపడ్డాడు.మహేష్ చూసిన చూపులో రమకు నిన్న రోడ్డు మీద జరిగిన యాక్సిడెంట్ దగ్గరకు తను పోవద్దని వెనక్కులాగిన విషయం గుర్తొచ్చింది. అందరం మనుష్యులమే కదా ! కనీసం జంతువుల్లో ఉన్న జాలి, దయ, ఐక్యత మనలో ఉండటం లేదేమిటి ? నాలాంటి వాళ్ళు ఎంత మంది ఉన్నారో లోకంలో మనుష్యులు మారకపోతే వాళ్ళకీ నాలాంటి గతే పడుతుంది. నాకిప్పుడు బుద్ధి వస్తే ఏం ప్రయోజనం ! మీరైనా నష్టం జరక్కముందే మారండి !

**-డా. కందేపి రాణి ప్రసాద్ సిరిసిల్ల**

## ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం

ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం ' సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పోలీస్ నేర దర్యాప్తు విభాగము సి.ఐ.డి వారు ఈ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కొరకు 'ఆపరేషన్ స్వేచ్ఛ-ఎఎ' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఒక నెల రోజులు పాటు అనగా ఈనెల 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు అన్ని జిల్లాల్లోని పోలీస్ మరియు ఇతర శాఖల సమన్వయంతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సి .ఐ.డి ప్రధాన కార్యాలయం మంగళగిరిలో సి.ఐ.డి. అడిషనల్ డి.జి.పి. సంజయ్,బాల కార్మికులకు వ్యతిరేకంగా ఒక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ ఆపరేషన్ స్వేచ్ఛా ఫేజ్-1కి కొనసాగింపు. ఫేజ్-ఎ సమయంలో, పిల్లలను రక్షించడానికి గణనీయమైన ప్రయ త్నాలు చేసింది, దీనికి ఉన్నతాధికారులు మరియు ప్రభుత్వం నుండి ప్రశంసలు లభించాయని తెలియజేసారు, అంతేకాకుండా , ఆపరేషన్ స్వేచ్ఛా ఫేజ్-ఎఎ ప్రారంభమైనప్పటి నుండి, మొత్తం 326 మంది పిల్లలను రెస్కు చేసారని, వీరిలో 289 మంది బాలురు, 37 మంది బాలికలు, రాష్ట్రవ్యాప్తంగా 45 మంది పిల్లలను చైల్డ్ కేర్ హోమ్‌లకు పంపగా, 281 మంది పిల్లలను వారి తల్లిదండ్రులతో కలపడానికి సిఐడి కృషి చేసిందని తెలియజేసారు. ఆపరేషన్ స్వేచ్ఛ-ఎఎ కోసం, శ్రీమతి కె.జి.వి. సరిత, ఎస్పీ సి.ఐ.డి. మహిళా సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కాంట్రోల్ రూము ఏర్పాటు చేసి రోజువారీ ఎంతమంది పిల్లలను బాలకార్మిక వ్యవస్థ నుండి విముక్తి కలిగించారు ఇంకా ఎంతమంది పిల్లలను వారి తల్లి తండ్రులకు లేదా సంరక్షణా గృహాలలో అప్పగించారు తదితర విశేషాలను జిల్లా అధికారుల ద్వారా తెలుసుకుంటున్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి, సి.ఐ.డి. ఎస్పీ శ్రీమతి కె.జి.వి. సరిత గారు, సి.ఐ.డి. ఉన్నతాధికారులు, లేబర్ డిపామెంట్ డిప్యూటీ కమిషనర్ గణెళిశన్ , చైల్డ్ రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్ స్టేట్ ప్రోగ్రామ్ డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబీ , బచ్పన్ బచావో ఆందోలన్ స్టేట్ కోఆర్డినేటర్ తిరుపతి రావు ఇంకా ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ నుండి ప్రతినిధులు హాజరయ్యారు.

# బైక్-టాక్సీ సంస్థలకు సుప్రీంకోర్టు భారీ షాక్

## సర్వీసుల అనుమతిని రద్దు చేసిన సుప్రీం

న్యూఢిల్లీ,జూన్12 : బైక్-టాక్సీ సంస్థలకు సుప్రీంకోర్టు సోమవారంనాడు భారీ షాక్ ఇచ్చింది. ఢిల్లీలో బైక్ టాక్సీ సర్వీసులను అనుమతిస్తూ హైకోర్టు ఇచ్చిన తాత్కాలిక ఆదేశాలను అత్యున్నత న్యాయస్థానం రద్దు చేసింది. ఢిల్లీ ప్రభుత్వం కొత్త పాలసీని రూపొందించేంత వరకూ ఢిల్లీలో టూవీలర్ నాన్ ట్రాన్స్‌పోర్ట్ టాక్సీలను నడపరాదంటూ ఆదేశాలు జారీ చేసింది. జూన్ 30వ తేదీ నాటికి బైక్-టాక్సీల అనుమతిపై నూతన విధానాన్ని తీసుకువస్తామని ఢిల్లీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు విన్నవించింది. దీంతో అప్పటి వరకూ ఢిల్లీలో టాక్సీ సేవలకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్టయింది. ఢిల్లీ ప్రభుత్వం గత ఫిబ్రవరిలో రైడ్ షేరింగ్ సంస్థల బైక్ టాక్సీ సర్వేసులపై నిషేధం విధించింది. వాణిజ్య అవసరాల కోసం ద్విచక్ర వాహనాలను ఉపయోగించడం మోటారు వాహనాల చట్టం-1988ని ఉల్లంఘించడలీజీనంటూ నోటీసులు ఇచ్చింది. దీనిపై రాపిడో, ఉబర్ ఇండియా సిస్టర్ ప్రైవేట్ లిమిటెడ్ హైకోర్టును అశ్రయించాయి. ఢిల్లీ ప్రభుత్వ ఇచ్చిన షోకాజ్ నోటీసును రాపిడో సవాలు చేస్తూ, ఇది ప్రాథమిక, రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని పేర్కొంది. దీనిపై హైకోర్టు మే 16న ఆదేశాలు జారీ చేసింది. బైక్-టాక్సీల అనుమతిపై ÷నైల్ పాలసీని నోట్గి÷ చేసేంత వరకూ ఎలాంటి ప్రతీకార చర్యలు తీసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఆదేశాన్ని ఆప్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. దీనిపై జస్టిస్ అనురుద్ధ బోస్, జస్టిస్ రాజేష్ బిందాల్‌తో కూడిన సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ సోమవారం విచారణ జరిపి, ఢిల్లీ ప్రభుత్వం కొత్త పాలసీని రూపొందించేంత వరకూ ఢిల్లీలో బైక్ టాక్సీలను నడపకూడదంటూ ఆదేశాలు జారీ చేసింది.

# మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

## నర్మదా పూజలో పాల్గొన్న ప్రియాంకా వాద్రా



భోపాల్,జూన్12 : కర్ణాటక ఎన్నికల్లో సాధించిన విజయంతో ఉత్సాహంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టింది. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా సోమవారంనాడు మధ్యప్రదేశ్‌లో పర్యటించి గ్వారీఘాట్ వద్ద నర్మదా పూజలో పాల్గొన్నారు. ప్రియాంక వెంట కాంగ్రెస్ నేత, మాజీ ముఖ్యమంత్రి కమల్ నాథ్, పార్టీ జనరల్ సెక్రటరీ ఇన్‌చార్జి జేపీ అగర్వాల్, రాజ్యసభ ఎంపీ వివేక్ తన్ఖా ఉన్నారు. మధ్యప్రదేశ్ జీవనాడిగా భావించే నర్మదా నదికి పూజలు చేసిన అనంతరం జబల్‌పూర్ నుంచి పార్టీ ప్రచారాన్ని ప్రియాంక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఐదు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రతి మహిళకు రూ.1,500 నెలవారీ సాయం అందిస్తామని, గ్యాస్ సిలెండర్ ధరను రూ.1000 నుంచి రూ.500కు తగ్గిస్తామని, రాష్ట్రంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. రైతుల బకాయిలను రద్దు చేస్తామని, 1000 యూనిట్ల వరకూ విద్యుత్‌ను ఉచితంగా అందిస్తామని, 200 యూనిట్ల లోపు వినియోగిస్తే సగానికి ఛార్జీలు తగ్గిస్తామని ప్రియాంక హామీ ఇచ్చారు. మధ్యప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం గత మూడేళ్లలో కేవలం 21 ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని, 18 ఏళ్లుగా బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదని, పెద్ద పెద్ద హామీలివ్వడం, వాటిని గాలికి వదిలేయడం పరిపాటైందని అన్నారు. డబుల్ ఇంజన్, ట్రిపుల్ ఇంజన్ ప్రభుత్వాలను తాను చాలా చూశానని, అలాంటి వారికి హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక ప్రజలు గట్టి గుణపాఠం చెప్పారని ప్రియాంక అన్నారు. మహాకేళేశ్వర్ ఆలయంలో సప్తర్షుల విగ్రహాలు కుప్పకూలడంపై మాట్లాడుతూ, దేవుళ్లను కూడా బీజేపీ లూటీ చేయడం మానడం లేదన్నారు. బీజేపీ లూటీకి మహాకాళ్ కూడా మినహాయింపు కాదన్నారు.

# శిరీష మృతిలో తండ్రి,బావలే కారణం

## కాల్ డేటా ఆధారంగా పోలీసుల దర్యాప్తు

వికారాబాద్,జూన్12(ప్రజామంటలు) :పరిగి మండలం కాడ్లాపూర్‌లో యువతి శిరీష అనుమానాస్పద మృతిపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. యువతి సెల్ ఫోన్ కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు మమ్మరం చేశారు. గ్రామానికి చెందిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. శిరీష అంత్యక్రియల అనంతరం ఆమె తండ్రి జంగయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాల్ డేటా ఆధారంగా శిరీష మృతి చెందిన మరుసటిరోజు యువతి ఫోన్ నుంచి ఓ వ్యక్తికి కాల్ వెళ్ళినట్టు పోలీసులు గుర్తించారు. రాత్రి గొడవ జరిగినప్పుడు శిరీష వద్ద నుంచి ఫోన్ లాగేసుకున్నానని పోలీసుల విచారణలో బావ అనిల్ చెప్పాడు. ఉదయం ఫోన్ నుంచి కాల్ వెళ్ళినప్పటికీ తనకు ఫోన్ పాస్వర్డ్ తెలియదంటూ అనిల్ బుకాయించే ప్రయత్నం చేశాడు. డాటా డిలీట్ కాకుండా సిడిఆర్ ద్వారా కాల్ హిస్టరీ సేకరించే ప్రయత్నం. కొంత సమయం గడిస్తే కేసు చిక్కుముడి వీడే అవకాశముంది. కాగా వికారాబాద్ జిల్లాలోని పరిగి కాడ్లాపూర్‌లో యువతి శిరీష అనుమానాస్పద మృతి కేసులో పోలీసుల విచారణపై అన్న శ్రీకాంత్ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హత్య.. ఆత్మహత్య అంటూ పోలీసులు తికమక చేస్తున్నారంటూ ఆవేదన చెందారు. ఆ చిన్న కుంటలో మోకాలి లోతు నీటిలో ఎలా ఆత్మహత్య చేసుకుంటారో చెప్పాలని యువతి అన్న శ్రీకాంత్ ప్రశ్నించారు. ఆ కుంటలో ఎలాంటి రాళ్ళు లేవన్నారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు సమగ్ర విచారణ చేయాలని..తమ కుంటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మా నాన్న తప్పు చేసినా... బావ తప్పు చేసిన శిక్షించాలి' అని అన్నారు. అసలు నిజం నిగ్గు తెల్చాలని డిమాండ్ చేశారు. మరోవైపు పోలీసుల తీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు సరిగ్గా విచారణ చేయడం లేదని అన్నారు. శిరీషది ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. యువతి మృతికి తండ్రి, బావ ఇద్దరు కారణమని.. పోలీసులు సరిగ్గా విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

# 15 నుంచి 17 వరకు జి 20 సమావేశాలు

## జి20 దేశాల వ్యవసాయ మంత్రుల రాక: కిషన్ రెడ్డి

హైదరాబాద్,జూన్12(ప్రజామంటలు) : భారత్‌లో జరుగుతున్న జీ20 సమావేశాలకు ఎంతో ప్రాధాన్యత ఏర్పడిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 15 నుంచి 17 వరకు హైదరాబాద్ వేదికగా జీ20 దేశాల వ్యవసాయ శాఖ మంత్రులు పాల్గొంటారని అన్నారు. హైటెక్స్‌లో ఈ సమావేశాలు జరుగుతాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఈ సమావేశంలో పాల్గొంటారు. ఆహార భద్రత, పౌష్టికాహారం కోసం సుస్థిర వ్యవసాయం, వాతావరణం మార్పు తట్టుకునేలా పంటలు పండించడంపై చర్చిస్తారు. ఆహారం కోసం ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడంపై కూడా చర్చిస్తారు. టూరిజం చివరి సమావేశాలు జూన్ 19, 20, 21, 22 తేదీల్లో గోవాలో జరుగుతాయి. గోవా రోడ్ మ్యాప్ పేరుతో డ్రాఫ్ట్‌ను జీ20 మంత్రుల సమావేశంలో తీర్మానంపై చర్చించి నిర్ణయం తీసుకుంటాం. సాంస్కృతిక శాఖ్గ ÷నైల్ మీటింగ్‌లు వారణాసిలో జరుగుతాయి. ప్రగతి మైదాన్‌లో సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో 18వ జీ20 చివరి సమావేశాలు జరుగుతాయని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

# ఉత్సాహంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

## రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ 2కే రన్

హైదరాబాద్,జూన్12 : తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ 2కే రన్‌ను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌తోపాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ఉత్సాహంగా రన్ కొనసాగింది. పోలీస్ వాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రన్‌లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని నె÷-లకెస్ రోడ్డులో అంబేద్కర్ విగ్రహం వద్ద మంత్రి మహమూద్ అలీ 2కే రన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, క్రీడాకారులు నిఖత్ జరీన్, ఈషా సింగ్, గాయకులు మంగ్లీ, రామ్ మిర్యాల, సినీ నటి శ్రీలీల పాల్గొన్నారు. నాలుగు వేలకుపైగా రన్నర్లు ఈ రన్‌లో పార్టిసిపేట్ చేశారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ రన్‌ను ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి మంత్రి జగదీశ్ రెడ్డి ప్రారంభించారు. మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడలో మంత్రి మల్లా రెడ్డి, ఎంపీ సంతోష్ కుమార్ తెలంగాణ రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు.

# సామాజిక బాధ్యతగా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన

- చట్టాలను సమర్థవంతంగా అమలు చేయండి..
- బాలలతో పనిచేయించే యజమానులపై కేసులను పెట్టండి..
- స్పెషల్ డ్రైవ్‌లో ఇప్పటి వరకు 23 కేసులు నమోదు..
- బాల కార్మిక రహిత జిల్లాగా గుర్తింపు తీసుకురండి..
- జిల్లా కలెక్టర్ యస్ డిల్లీరావు.

విజయవాడ,జూన్12 :బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనను ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకుని జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా గుర్తింపు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు అన్నారు.ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం సందర్భంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణంలో కార్మిక, మహిళాభివృద్ధి శిశు సంక్షేమం, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, వాసవ్య మహిళ మండలి, స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీ రావు ముఖ్య అతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలనకు 1980 సంవత్సరంలోనే అంతర్జాతీయంగాను పలు చట్టాలను చేసినప్పటికి మన దేశంలో బాల కార్మికులకు సంబంధించి నేటికి కేసులు నమోదు కావడం జరుగుతుందన్నారు.దేశంలో ఈ చట్టంపై ప్రజలను చైతన్యం చేయడం, అవగాహన కల్పించడం వంటి పరిస్థితులు రాకుండా ఉండాలని, వీలైనంత త్వరగా దేశంలో ఈ చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసే స్థాయికి తీసుకురావాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం చేస్తున్న చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు బాధ్యతగా గుర్తించాలన్నారు. బాలకార్మికులకు వ్యతిరే కంగా ఈనెల 30వ తేది వరకు జిల్లాలో బాలకార్మికలను గుర్తించేందుకు కార్మిక, పోలీస్, మహిళాభివృద్ధి శిశు సంక్షేమం, రెవెన్యూ, చైల్డ్‌లైన్, స్వచ్ఛంద సంస్థల సభ్యులతో టాస్క్‌ఫోర్స్ కమిటి ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించి ఇప్పటి వరకు 23 కేసులను నమోదు చేశారన్నారు. విరిలో ఇద్దరు బాలకార్మికులను ప్రమాదకర ఆటోమొబైల్ రంగంలో పని చేయిస్తున్న యజమానులపై ప్రాస్యిక్యూషన్ క్లయిమ్ చేయడం జరిగిందన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో గుర్తించిన బాల కార్మికుల తల్లిదండ్రులతో మాట్లాడి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చడం ద్వారా బాలల ను పనులలో పెట్టేందుకు దారి తీసిన ఆర్థిక పరిస్థితుల నుండి విముక్తి కల్పించేందుకు దోహదపడుతుందన్నారు. బాల కార్మికులుగా గుర్తించి విముక్తి కల్పించిన వారికి పునరావాస కేంద్రాలలో చేర్పించి నిర్బంద విద్య పథకం కింద పాఠశాలలో చేర్పించాలన్నారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించి బాల్యానికి భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలలు పున:ప్రారంభమైనందున బడిఈడు పిల్లలు ప్రతీ ఒక్కరూ బడిలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాల కార్మికులను, బడిబయట ఉన్న పిల్లలను, అపదలో ఉన్న బాలలను గుర్తిస్తే తక్షణమే చైల్డ్ లైన్ 1098, కు గాని పోలీస్ 100/112 లేదా ఉమెన్ హెల్ప్‌లైన్ 181కు తెలియజేయడం మనందరి బాధ్యతగా గుర్తించుకోవాల న్నారు. బాల కార్మిక వ్యవస్థ, చట్టాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం ద్వారా బాల కార్మిక వ్యవస్థను సమూలంగా రూపుమాపగలుగుతామన్నారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా సహకారంతో ప్రజలను చైతన్యవంతులను చేసి జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా గుర్తింపు తీసుకురావాలని కలెక్టర్ డిల్లీరావు కోరారు.అనంతరం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా బాల్యం... బడికి... అనే అవగాహన కల్పించే పోస్టర్‌ను, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ ఏర్పడి నేటికి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా లోగో పోస్టర్‌ను కలెక్టర్ డిల్లీరావు విడుదల చేశారు.తదుపరి నాదేశ బాలలాలికలపై జరుగుతున్న హింసా, దోపిడి, అత్యాచారాలను వ్యతిరేకిస్తానని.... బడి బయట ఉన్న బాలలందరిని బడిలోకి చేర్పిస్తానని.... అపదలో ఉన్న బాలలందరి రక్షణకు అండగా ఉంటానని.... నా ఆత్మ సాక్షిగా ప్రతిజ్ఞ చేస్తున్నానని కలెక్టర్ డిల్లీరావు అందరితో ప్రతిజ్ఞ చేయించారు. నేను బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకిని అని సిగ్నేచర్ క్యాంపెయిన్‌లో కలెక్టర్ డిల్లీరావు తొలి సంతకం చేశారు.కార్యక్రమంలో కార్మిక శాఖ డిప్యూటి కమిషనర్ యం. శ్రీమన్నారాయణ, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జి. ఉమాదేవి,డియంహెచ్‌వో డా. యం సుహాసిని, దిశ స్టేషన్‌ఆఫీసర్ కె. వాసవి, సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ కె. సువార్త, సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటి డైరెక్టర్ ఎన్.వి. విజయభారతి, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ డైరెక్టర్ బిఎస్ కోశ్వరరావు, జిల్లా కో-ఆర్డినేటర్ అరవరమేష్, వాసవ్య మహిళ మండలి ప్రతినిధులు బి.కీర్తి, అసిస్టెంట్ కమిషనర్ ఎస్ఎస్‌పివో పి.విష్ణు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు పి శ్రీనివాస్, రత్నకుమారి ఉన్నారు.

# ప్రతి ఒక్కరూ మాతృభాషకు పునరంకితం కావాలి

## గురువందనం కార్యక్రమంలో వెంకయ్యనాయుడు



నెల్లూరు,జూన్12 : ప్రతి ఒక్కరూ మాతృభాషకు పునరంకితం కావలసిన అవసరం ఉందని భారతదేశ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. వి.ఆర్. కళాశాలలో వెంకయ్యనాయుడు గారి గురువు గారైన మోపూరు వేణుగోపాలయ్య గారి స్మృత్యర్థం నెల్లూరులో ఏర్పాటు చేసిన గురువుకు వందనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారి జీవిత విశేషాలతో రూపొందించిన 'ప్రవచన సుధాకరుని వేణునాదం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. చక్కగా పుస్తకాన్ని రూపొందించిన శ్రీ మోపూరు వేణుగోపాలయ్య గారి ఆత్మీయ బృందం, రూపకల్పనా బృందాన్ని వారు అభినందించారు. కార్యక్రమ ప్రారంభంలో చిన్నారులచే ఏర్పాటు చేసిన అన్నమయ్య కీర్తనల ఆలాపన కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకుంది. వెంకయ్యనాయుడు ప్రసంగంలోని ముఖ్య అంశాలు? మాతృభాషలోనే మన భావాలను సమగ్రంగా వివరించగలం. ముందు మాతృభాష, తర్వాత సోదర భాష, అటుపైన పరభాష. సద్బుద్ధి, సదాలోచన, సద్వివేచనను ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలి. తల్లిదండ్రులు, గురువులు, సహచరుల పేరిట ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలి. పెద్దలను గౌరవించటం, ప్రకృతితో కలిసి జీవించటం మన జీవన విధానంలో భాగం చేసుకోవాలి. కష్టపడి, ఇష్టపడి పనిచేయటానికి మించిన విజయసూత్రం లేదు. విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకున్న గురువులు మనకు ఉన్నారు. అదే మన దేశ సంస్కృతి. నా విద్యార్థి జీవితాన్ని, రాజకీయ జీవన గమనాన్ని తీర్చిదిద్దిన అనేక మంది ఉపాధ్యాయులు మరియు మార్గదర్శకుల సహకారాన్ని గుర్తు చేసుకున్నప్పుడు వారి పట్ల కృతజ్ఞతా భావంతో నా మనసు నిండిపోతుంది. ఎందుకంటే వారు స్వార్థర హితంగా నా జీవితానికి దిశానిర్దేశర చేశారు. నేను ఎదగాలన్న ఆకాంక్ష తప్ప, వారి మనసుల్లో మరే ఇతర భావమూ లేదు. చాలా మంది నేను తెలుగు బాగా మాట్లాడతాను అంటారు. వాక్పటిమను పొందింది నా స్వీయ కృషితో అయినా, భాష పట్ల నా ఆసక్తి, అనురక్తి పెరగటానికి కారణం మాత్రం పోలూరి హనుమజ్జానకీరామశర్మ , మోపూరు వేణుగోపాలయ్య అని చెప్పటానికి నేను గర్వపడతాను. విద్యార్థుల జీవితాలను ఉన్నత మార్గంలో నడిపేందుకు వారు తీసుకునే చొరవ ఎంతో ఉన్నతమైనది. ఆరోజుల్లో వారు పాఠం చెప్పే తీరు కూడా ఎంతో ఆసక్తికరంగా ఉండేది. మాటలో స్పష్టత, విషయ పరిజ్ఞానం, కట్టిపడేసే మాటతీరు వెరసి... వారు పాఠం చెబుతుంటే శ్రద్ధగా లీనమై వింటూ ఉండిపోయే వాళ్ళం. సమయం కూడా తెలిసేది కాదు. ముఖ్యంగా నా పట్ల వారు చూపించిన అభిమానం మరువలేనిది. వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతి అవుతారని ఆ రోజు వారికి తెలియకపోవచ్చు గానీ... గొప్పవాడిని అవుతాననే నమ్మకం వారికి నాకంటే ముందే కలిగింది. నా నాయకత్వ లక్షణాలతో పాటు, మాట తీరును గమనించి వారు సూచనలు చేసే వారు. ముఖ్యంగా నాడు వారు చేసిన సూచనలు రాజకీయాల్లో నాకు ఎంతగానో తోడ్పడ్డాయి. విషయ పరిజ్ఞానం నా స్వయం కృషి అయినప్పటికీ, విద్యార్థిగా ఉన్న సమయంలో వారు చేసిన సూచనల వల్ల నా మాటతీరులో వచ్చిన మార్పులు తర్వాత కాలంలో ఎంతగానో తోడ్పడ్డాయి. పుస్తకాలను చదవమంటూ నాడు వారు చేసిన సూచన, నా విషయంలో ఇప్పటికీ కొనసాగుతోంది. నేటికీ నిత్యవిద్యార్థిగా ముందుకు సాగే నా జీవితంలో తొలి అడుగు వారి దగ్గరే పడింది.వేణుగోపాలయ్య గారు ఉపాధ్యాయుడిగానే గాక రచయితగా, ప్రవచనకర్తగా మహోన్నతమైన ఆధ్యాత్మిక సంపదను తెలుగు వారి అందించారు. ఆయన ఎప్పుడూ సంపదను రూపాయల్లో లెక్క వేసుకోలేదు. అక్షరాల్లోనే కొలుచుకున్నారు. అందుకే ఆధ్యాత్మికంగా అంతటి ఉన్నతులుగా నెల్లూరులో పేరు సంపాదించుకున్నారు. ? శ్రీ మోపూరు వేణుగోపాలయ్య స్మృతికి ఈ సందర్భంగా నివాళులు అర్పిస్తూ... వారి స్ఫూర్తితో యువతరం నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తున్నాను.

# అందుబాటులోకి గద్వాల కలెక్టరేట్,ఎస్పీ కార్యాలయం



మంత్రులతో కలసి ప్రారంభించిన సిఎం కెసిఆర్

గద్వాల బిఆర్ఎస్ కార్యాలయానికి కూడా ప్రారంభం

జోగులాంబ గద్వాల,జూన్12(ఆర్ఎన్ఎ): గద్వాల జిల్లా కలెక్టరేట్‌ను ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సోమవారం ప్రారంభించారు. తొలుత పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ముఖ్యమంత్రి.. అనంతరం పూజా కార్యక్రమాల్లో పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం కార్యాలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం చాంబర్‌లో కలెక్టర్ వల్లూరి క్రాంతిని కూర్చోబెట్టి.. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ శాంతికుమారి, మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహ్మూద్ అలీ,ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అబ్రహం, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.జిల్లా కేంద్రాల ఏర్పాటు తర్వాత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జోగులాంబ గద్వాల జిల్లాలలో సకల సదుపాయాలతో సమీకృత కలెక్టరేట్‌ను నిర్మించింది. కలెక్టరేట్ భవనాన్ని రూ.51.18 కోట్లతో మూడు అంతస్తుల్లో నిర్మించింది. వివిధ శాఖలకు చెందిన 36 జిల్లా స్థాయి కార్యాలయాలను ఏర్పాటు చేశారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయం 1.39 లక్షల చదరపు మీటర్లలో 46 గదులతో ఏర్పాటైంది. కలెక్టర్ చాంబర్‌తోపాటు అదనపు కలెక్టర్ల చాంబర్లు, వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌తో పాటు విశ్రాంతి హాల్ నిర్మించారు. మొదటి, రెండో అంతస్తులో జిల్లా అధికారుల కార్యాలయాలు, సమీపంలోనే ముఖ్య అధికారులు ఉండేలా ఎనిమిది నివాస భవనాలు నిర్మించారు. కార్యాలయ ఆవరణలోని గార్డెనింగ్, కాకతీయుల కాలం నాటి స్తంభాలను కలెక్టరేట్ ముందు భాగంలో నిర్మించడంతో కలెక్టరేట్ ప్రత్యేక శోభ సంతరించుకున్నది. అలాగే జోగులాంబ గద్వాల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి కూడా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రారంభోత్సవం చేశారు. మొదట కార్యాలయానికి చేరుకున్న సీఎంకు హోంమంత్రి మహమూద్ అలీ, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, డీజీపీ అంజనీకుమార్‌తో పాటు పోలీసు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎంకు పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం కార్యాలయ శిలాఫలకా న్ని ప్రారంభించారు. కార్యాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎస్పీ చాంబర్‌లో జిల్లా పోలీస్ అధికారి సృజనను కూర్చోబెట్టి.. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. గద్వాల జిల్లా పోలీస్ కార్యాలయ సముదాయాన్ని ప్రభుత్వం రూ.38.50 కోట్లతో నిర్మించింది. కార్యాలయంలో సిబ్బంది విధులు నిర్వహించేందుకు నాలుగు ఫోర్లు, 45 గదులు, సమీక్ష సమావేశాల కోసం కాన్ఫరెన్స్‌హాల్, ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేశారు. సాయుధ దళపతి కార్యాలయంతోపాటు ఆర్మ్‌డ్ సిబ్బంది ఉండేలా రెండు బరాక్‌లు నిర్మించారు. ల్యాబ్ సౌకర్యం, ఫోరెన్సిక్, సైబర్, క్లూస్‌టీం కోసం సైతం వసతులు కల్పించారు. డాగ్, బాంబ్ స్కాడ్ సిబ్బందికి వసతి కూడా ఏర్పాట్లు చేశారు. ఇకపోతే జిల్లా బీఆర్ఎస్ పార్టీని ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. మొదట తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పండితుల వేద మంత్రోచ్చరణాల మధ్య శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి పార్టీ కార్యాలయాన్ని కేసీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్వాల్ జిల్లా పార్టీ ఇంచార్జి బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని సిఎం కెసిఆర్ కుర్చీలో కూర్చోబెట్టారు. కార్యక్రమంలో మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అంబ్రహం, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, అంజయ్య యాదవ్, శాట్స్ చైర్మన్ ఆంజనేయులు గౌడ్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. సిఎం రాకతో జిల్లాలో భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు.



# మోగిన బడిగంటలు

## ముగిసిన వేసవి సెలవులు

## తెరుచుకున్న స్కూళ్లు



హైదరాబాద్,జూన్12 : బడి గంటలు మోగాయి. ఎండలు తగ్గకున్నా జూన్ 12 కావడంతో స్కూళ్లు తెరుచుకున్నాయి. వేసవి సెల వులు ముగియడంతో కొత్త అందాలు సంత రించుకొన్నాయి. నెలన్నర నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ చిన్నారుల కిలకిల రావాల ఆనందహేల గలగలా సవ్వడి చేసింది. అడుగులో అడుగు వేస్తూ బాల సైనికులు బడి ఒడిలోకి అడుగుపెట్టారు. వేసవి సెలవుల తర్వాత రాష్ట్రంలోని 41 వేల స్కూళ్లు, గురుకులాలు, వసతిగృహాలు సోమవారం తెరుచుకొన్నాయి. దీంతో దాదాపు 60 లక్షల మంది విద్యార్థులు తిరిగి బడిబాటపట్టనున్నారు. ఇన్నాళ్లు సెలవుల మజాను ఆస్వాదించి.. ఆటలు పాటలతో గడిపిన చిన్నారులంతా సోమవారం నుంచి చదువుల ప్రపంచంలోకి అడుగుపెట్టనున్నారు. నేపథ్యంలో ప్రభుత్వ బడులను మరింత బలోపేతం చేసే, విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు పాఠశాల విద్యాశాఖ పటిష్ఠ కార్యాచరణను సిద్ధం చేసింది. నూతన విద్యాసంవత్సరంలో చేపట్టే కార్యక్రమాలతో పాఠశాల విద్య, సమగ్ర శిక్ష, స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ (సైట్)లకు అధికారులు వేర్వేరు ప్రణాళికలను రూపొందించారు. వాటిని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణకు సమర్పించి ఆమోదం తీసుకున్నారు. నిరుడు 1-8 తరగతుల్లో ఆంగ్ల మాధ్యమ బోధనను ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. ఈసారి దాన్ని 9వ తరగతికి విస్తరించనున్నది.

# జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

## లారీని ఢీకొన్న కారు: ఆరుగురు మృతి

కాకినాడ,జూన్12 : తూర్పు గోదావరి జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని వెనుక నుండి కారు ఢకొట్టడంతో ఆరుగురు మృతి చెందిన ఘటన నల్లజర్ల మండలం అనంతపల్లి వద్ద సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... రాజమండ్రి దగ్గర ప్రకాష్‌నగర్ నుంచి కారులో ఎనిమిదిమంది ఏలూరు వద్ద కొత్తూరు గ్రామంలో గృహప్రవేశానికి హాజరయ్యారు. తిరిగి వస్తుండగా నల్లజర్ల మండలం అనంతపల్లి గ్రామం వద్ద 16 వ నంబరు జాతీయ రహదారి వంతెన పై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు ఢకొ?ట్టడంతో కారులో ఉన్న ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు, ఒక బాలుడు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలవ్వడంతో వారిద్దరినీ హైవే అంబులెన్స్ లో కొవ్వూరు ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతులలో సత్తిబాబు, రవితేజ, శ్రావణికుమారి, అరుణ, 8 నెలల బాలుడితో పాటు మరొకరు ఉన్నట్లు గుర్తించారు. గాయపడినవారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కొవ్వూరు డీఎస్పీ వర్మ తెలిపారు.





నరేంద్రమోదీ కేంద్ర ప్రభుత్వ 9 సంవత్సరాల పరిపాలన విజయాల ప్రచార కార్యక్రమాల్లో భాగంగా గుంతకల్లు అసెంబ్లీ సంయుక్త మోర్చాల సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొని కేంద్రంలోని నరేంద్ర మోదీ 9 సంవత్సరాలలో సాధించిన విజయాలను ప్రచారం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.



తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జనగామ రైల్వే స్టేషన్ నుండి బతుకమ్మ కుంట వరకు 2కె రన్ ను జిల్లా కలెక్టర్ సిహెచ్. శివ లింగయ్య డిసిపి సీతారాం ప్రారంభించారు. పాల్గొన్న అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, రోహిత్ సింగ్, మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున, ఏసిపి దేవేందర్ రెడ్డి.



కరీంనగర్ పద్మనాయక కళ్యాణ మండపంలో రాయికల్ మున్సిపల్ వైస్ ఛైర్మెన్ గండ్ర రమాదేవి అచ్యుత రావు ల కుమా రుని వివాహానికి హాజరై వధూ వరులను ఆశీర్వదించిన జగిత్యాల ఎమ్మెల్యే దంపతులు డా. సంజ య్ కుమార్, రాధిక, హాజరైన కోరుట్ల, చొప్పదండి ఎమ్మెల్యేలు సుంకే రవి శంకర్, లైబ్రరీ ఛైర్మెన్ డా. చంద్ర శేఖర్ గౌడ్, జగిత్యాల మున్సిపల్ ఛైర్మెన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల పట్టణంలో శ్రీ వేద మల్టీస్పెషాలిటీ, ఎమర్జెన్సీ క్రిటికల్ కేర్ హాస్పిటల్ నూతనంగా ప్రారంభించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియ జేసిన జిల్లా జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత.

## తెలంగాణ అస్థిత్వం, తెలంగాణ ప్రగతి

### అంశంపై స్తంభంకాడి ప్రకాశ్ కవితలు



మేడ్చల్ జూన్ 12 (ప్రజామంటలు): దశాబ్ది ఉత్సవాల సంధర్భంగా.... కవి సమ్మేళనం తెలం గాణ అస్థిత్వం... తెలంగాణ ప్రగతి అనే అంశంపై స్తంభంకాడి ప్రకాశ్ కవితలు చదవటం జరిగిం ది. మేడ్చల్ మల్కాజిగిరి జయింట్ కలెక్టర్ సిఈఓ మండలాధ్యాక్షులు దాదాపు వంద మంది కవుల మధ్య స్తంభంకాడి ప్రకాశ్ కు శాలువా, ప్రశంసా పత్రంతోపాటు నగదు బహుమతితో సత్కరించారు. ఈ సందర్భంగా ఆండాళ్ నగర్ సాయి గార్డేన్ మిత్రులు పురుషోత్తం, శ్రీనివాస్ రెడ్డి, గంగాధర్, శ్రీనివాస్, రంజిత్ లు స్తంభంకాడి ప్రకాశ్ ను అభినందించారు.

## అపూర్వ కలయిక-మేలుకొలపే ఇక పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

హుజురాబాద్ జూన్ 12 (ప్రజామంటలు): 20 ఏండ్ల తరువాత బాల్యమిత్రులు ఒక చోట కలుసు కోవడం చెప్పుకోలేని మధుర అనుభవం. ఆదివారం సింగాపూర్ గ్రామ ఉన్నత పాఠశాలలో 2002-2003 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గురువులతో పాటు విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆత్మీయంగా పలుక రించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానంలో గౌర వా న్ని పొందినప్పుడే ఉపాధ్యాయులకు పూర్తి గుర్తింపు లభిస్తుందని, విద్యార్థుల ఉన్నతిని తెలుపుతుంటే చాలా సంతోషంగా ఉందని పేర్కొ న్నారు. గురువులు చూపించిన సన్మార్గంలో నడిచి ప్రస్తుతం ప్రతి విద్యార్థి వివిధ వృత్తుల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో కొనసాగుతూ ఆనంద జీవితాన్ని గడుపుతు న్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ప్రేమకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## జూన్ 14 నుండి టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

హనుమకొండ జూన్ 12 (ప్రజామంటలు): ఉమ్మడి వరంగల్ జిల్లాలో పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు 14వ తేదీ నుండి 20 తేది వరకు నిర్వహిస్తారని, వీరికి ఉదయం వేళలో 9:30 నుంచి 12:30 వరకు పరీక్షలు నిర్వహిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. వరంగల్ లో మూడు, హనుమకొండ లో మూడు పరీక్షా కేంద్రాలలో నిర్వహిస్తారని తెలిపారు. వరంగల్ జిల్లా నుంచి 1024 మంది, హనుమకొండ నుంచి 1116 విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. వీరికి సంబంధించిన హాల్ టికెట్లను ప్రింటెడ్ నామినల్ రూల్స్ తో పాటు సంబంధిత పాఠశాలలకు అందజేసినట్లు తెలిపారు. హాల్ టికెట్ లను www.bse.telangana.Govt.in హాల్ టికెట్లను వెబ్సైట్ నందు పొందుపరిచినట్లు తెలిపారు.




జగిత్యాల పట్టణంలోని మల్లేశం ఐఏఎస్ అకా డమీలో సభ్యులకు ప్రతి వారం ఇచ్చే కంప్యూటర్ బహుమతిని మాజీ మున్సిపల్ చైర్పర్సన్ టి. విజయలక్ష్మి విజేతకు అందజేశారు.

## నాగ సముద్రాల ఆదర్శ పాఠశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ గా పని చేసేందుకు దరఖాస్తుల ఆహ్వానం

కోహెడజూన్12(ప్రజామంటలు): తెలంగాణ ఆదర్శ పాఠశాల నాగసముద్రాల కోహెడ మండలం సిద్దిపేట జిల్లా నందు వివిధ సబ్జెక్టులు బోధించేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. కోట నరేందర్ రెడ్డి తెలిపారు.

పోస్టుల వారీగా ఖాళీల వివరాలు: పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ రాజనీతి శాస్త్రం: అర్హతలు రాజనీతి శాస్త్రంలో పీజీ చేసి బి.ఎడ్ పాసై ఉండాలి.

ట్రైయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులు :

తెలుగు, సాంఘిక శాస్త్రం, హిందీ (2) అర్హతలు: గ్రాడ్యుయేషన్, బి.ఎడ్ / టిపిటి / హెచ్ పి టి తోపాటు టెట్ క్వాలిఫై అయి ఉండాలి. పైన పేర్కొన్న వివిధ పోస్టులకు పాఠశాలలో దరఖాస్తు చేసుకునేందుకు 16 జూన్ 2023 చివరి తేదీ.

# తెలంగాణ అస్తిత్వం, ప్రగతి పై కవి సమ్మేళనం




జనగామ జూన్ 12 (ప్రజామంటలు): జనగామ జిల్లాలో అంగ రంగ వైభవంగా తెలంగాణ సాహితీ దినోత్సవం, తెలంగాణ సాహిత్య దినోత్సవానికి కవులు, కవయిత్రులు ఉత్సాహంగా తరలివచ్చి తమ పద్య, వచన కవిత్వాల తో తెలంగాణ ఔన్నత్యాన్ని, ఘనకీర్తిని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా జిల్లా కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య పాల్గొని మాట్లాడుతూ.... తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కవులు, కళాకారుల భాగ స్వామ్యం ఎంతో ఉందని వారికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యత కల్పిస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెలంగాణ సాహితీ దినోత్సవాన్ని భ్రమరాంబ గార్డెన్ లో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కవులు రాసిన పాటలు, వారు పాడిన పాటలు ప్రజల్లో ఉత్తేజాన్ని నింపాయని అలాగే కవులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడంతో పాటు వారికి తగిన ప్రాధాన్యతనిస్తుందని కలెక్టర్ వివరించారు. స్వరాష్ట్రంలో మన సాహిత్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహిన్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్రం పోరాతం. సాహితీ రంగంలో వారు తమదైన ముద్ర వేసినారని కవులకు ప్రత్యేక స్థానం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. చరిత్ర లో సాహిత్యానికి ఒక ప్రత్యేకత ఉన్నదని దేశంలో వివిధ భాషలకు అనుకూలంగా పరిస్థితులను బట్టి ప్రత్యేకత ఉంటుందని స్వతంత్ర పోరాటంలో సాహిత్యం ప్రత్యేక పాత్ర పోషించిందని అన్నారు గతంలో తెలం గాణ కవులకు గౌరవం తగ్గేది కాదని ప్రస్తుతం తెలంగాణ ఏర్పడ్డాక కవులకు ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపును ఇస్తుందని తెలిపారు అలాగే సాహిత్యానికి పునర్జీవనం ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. ప్రస్తుతం సినిమాలలో తెలంగాణ భాష యాస వాడుతున్నారని తెలిపారు. సినిమాలలో తెలంగాణ భాష వాడుతున్న సినిమాలు ఆస్కార్ అవార్డు వరకు వెళ్తున్నాయని గుర్తు చేశారు. కవులకు పుట్టినిల్లు అయినందున రూ. 3 కోట్లతో బమ్మెర పోతన విగ్రహంతో పాటు వాల్మీకి సోమనాధుని విగ్రహాలు కూడా ఏర్పాటు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కవులను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు, పారితోషికాన్ని అందించారు. అంతకు ముందు జనగామ జిల్లా ప్రసిద్ధి చెందిన బొమ్మెర పోతన వాల్మీడీ సోమనాథుడి విగ్రహాలకు అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ పూలమాల వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజలను చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులు చేసిన నృత్యాలు పలువురుని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా అగ్రికల్చర్ అధికారి వినోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రజిత, కలెక్టరేట్ ఏవో మల్సూర్ రాము, ఆర్టికల్చర్ అధికారి లత కవులు, ఇతర జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఖ్యాతిని చాటి చెప్పేలా దశాబ్ది వేడుకలు





- జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగిన తెలంగాణ రన్
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ప్ల కార్డులు



జగిత్యాల జూన్ 12 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ రన్ కార్యక్రమం తెలంగాణ ఖ్యాతిని, అభివృద్ధిని చాటి చెప్పేలా జిల్లాలో ఉత్సాహభరితంగా సాగింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "తెలంగాణ రన్" కార్యక్రమం జగిత్యాల, ధర్మపురి, కోరుట్లలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ముఖ్య అతిథి లుగా ధర్మపురిలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాలలో శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్, కోరుట్ల నియోజకవర్గంలో కల్వకుంట్ల విద్యాసాగర్ రావు హాజరైన రంగుల బెలూన్ లు వదిలి జెండా ఊపి తెలంగాణ రన్ ను ప్రారంభించారు. జిల్లాలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, యువతీ, యువకులు, పోలీస్ సిబ్బంది, కళాశాల, విద్యార్థులు తెలుపు రంగు టీ షర్టులను ధరించి, పెద్ద ఎత్తులో తెలంగాణ రన్ లో భాగస్వామ్యం కావడం తెలంగాణ దశాబ్ద కాలం ప్రగతికి అద్దం పట్టింది. ఈ సందర్భంగా సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రం గత పదేండ్లలో సాధించిన ప్రగతిని దేశ నలుమూలలా తెలియజేసేలా తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో అనుమానాలను పటాపంచలు చేస్తూ అద్భుత ఫలితాలను తెలంగాణ పోలీసులు సాధించారని అన్నారు. పోలీసు శాఖ పరిధిలో గతంలో ఉన్న పరిస్థితులకి, నేడు ఉన్న పరిస్థితులకి పొంతన లేదని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు అద్భుత విజయం సాధించారని ఆయన ప్రశంసించారు. మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వ షీ టీమ్స్ ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణతో మహిళలపై వేధింపులను పూర్తిగా అరికట్టడం జరిగిందని తెలిపారు. డయల్ 100 కి ఫోన్ చేసిన వారికి నిమిషాల వ్యవధిలో సహాయం అందించడం జరుగుతుంది అని అన్నారు. జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ శ్రీ యాస్మిన్ భాషా మాట్లాడుతూ.... దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 2 నుండి 22 వ తేదీ వరకు రోజుకో కార్యక్రమం నిర్వహించు కుంటున్నామని అన్నారు. అందులో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వ ర్యంలో తెలంగాణ రన్ ను నిర్వహించుకున్నామని, వ్యాయా మం, క్రీడల ద్వారా మానసికోల్లాసం కలుగుతుందని అన్నారు. అందరి కీ ఫిట్ నెస్ చాలా ముఖ్యమని, తెలంగాణ రన్ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించిన జిల్లా పోలీస్ శాఖకు, భారీ సంఖ్యలో వచ్చిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.జగిత్యాల జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిచే విధంగా అందరు కృషి చేయాలని కోరారు.

జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ మాట్లాడుతూ.... దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించుకుంటున్నామని అన్నారు. దశాబ్ది వేడుకల స్ఫూర్తితో మరో దశాబ్ద కాలానికి ప్రణాళిక వేసుకోవచ్చని తెలిపారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చి తెలంగాణ రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు గాను అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ప్లకార్డులు:

తెలంగాణ రన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో మహిళల రక్షణకు, మాదకద్రవ్యాల నిర్మూలనకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను తెలియజేస్తూ, వినూత్నంగా రూపొందించిన ప్లకార్డులు తెలంగాణ రన్ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, అందరినీ ఆకట్టుకున్నాయి.

## గాగిరెడ్డిపల్లిలో పోచమ్మ తల్లికి పెద్ద ఎత్తున బోనాలు

### బోనమెత్తిన సామాజిక సేవకురాలు మంజులా రెడ్డి





చిగురుమామిడి జూన్ 12 (ప్రజామంటలు): చిగురు మామిడి మండలం గాగిరెడ్డిపల్లి గ్రామంలో బొడ్రాయి పునః ప్రతిష్టలో భాగంగా పోచమ్మ తల్లికి కుల మతాల కతీతంగా ప్రతి గడప నుండి మహిళలు పెద్ద ఎత్తున బోనాలు తీసుకొని డప్పుల చప్పుళ్ళ శివసతుల పూనకాల మధ్య, ఆలయాలకు చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండా లని, పంటలు బాగా పండాలని అమ్మవార్లను వేడుకున్నారు. పోచమ్మ తల్లి ఆలయం ముందు బైండ్ల పూజారులు వేసిన పట్నాలు, ఆటపాటలతో సందడి చేశారు. పోచమ్మ బోనాలకు ముఖ్యఅతిథిగా సామాజిక సేవకురాలు కర్ణ కంటి మంజులరెడ్డి హాజరై బోనం ఎత్తుకొని పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమంతో పాటు మూడు నాలుగు రోజులు మహిళల కుంకుమ పూజతో పాటు వేద పండితులతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామస్తులందరూ పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు సహకరించిన ప్రతి ఒక్కరికి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోసర్పంచ్ సన్నీల వెంకటేష్ ఉప సర్పంచ్ అన్నాడి మల్లికార్జున రెడ్డి కమిటీ సభ్యులు కలువల రాజేశ్వర్ రెడ్డి, రాజిరెడ్డి, బొమ్మగాని వెంకటేశం మధు, నరాల రాజయ్య తిరుపతి, దారవేణి మొండయ్య, కూన లింగం ములుగురి లింగం, రాజయ్య మంద రాజయ్య నాగయ్య, రంగారెడ్డి రాజేశ్వర్ రెడ్డి మంద శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, మంద ఎల్లయ్య మంద చంద్రయ్య, సువర్ణ చారి, అనిల్ యాదవ్, గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

## బడిబాట పట్టిన చిన్నారులు

### ఎండ వేడి తగ్గకపోవడంతో ఆందోళనలో పేరెంట్స్



సికింద్రాబాద్ జూన్ 12 (ప్రజామంటలు): సమ్మర్ హాలీడేస్ తర్వాత సోమవారం పాఠశాలలు తిరిగి ప్రారంభం కావడంతో పిల్లలు బడిబాట పట్టారు. చాలా చోట్ల చిన్నారులు స్కూల్ కు వెళ్ళడానికి కొంత మారం చేయగా, ప్యారెంట్స్ వారిని బుజ్జగించి, స్కూల్ కు తీసుకెళ్ళి విడిచిపెట్టి వచ్చారు. బన్సీలాల్ పేట డివిజన్ మేకల మండి ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం స్కూల్ను పువ్వులు, మామిడి తోరణాలతో అలంకరించారు. చిన్నారి స్టూడెంట్స్కు వెల్ కమ్ బ్యాక్ చెబుతూ టీచర్లు వారికి పెన్సిల్స్, చాక్లెట్స్ ఇచ్చారు. ఎండల తీవ్రత ఇంకా తగ్గకపోవడంతో చిన్నారి పిల్లలను స్కూళ్ళకు పంపడానికి పేరెంట్స్ ఆందోళన చెందుతున్నారు.

## వారాసిగూడలో దారుణం

- 7 ఏండ్ల మానసిక వికలాంగురాలిపై రేప్ తీవ్ర రక్తస్రావం
- గాంధీలో కొనసాగుతున్న ట్రీట్మెంట్



సికింద్రాబాద్ జూన్ 12 (ప్రజామంటలు): వారాసిగూడ పీఎస్ పరిధిలో దారుణం జరిగింది. ఏడేండ్ల మానసిక వికలాంగురాలైన మైనర్ బాలికపై అత్యాచారం జరగ్గా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటన వివరాలు ఇవి..వారాసిగూడ ఠాణా ఇన్స్పెక్టర్ పి. శంకర్ కథనం ప్రకారం.... వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బౌద్ధనగర్ డివిజన్ ఎల్.ఎన్ నగర్ లోని ఓ బిల్డింగ్ లో సెకండ్ ఫ్లోర్ లో నివాసముంటున్న దంపతులకు ఏడేండ్ల వయస్సు కలిగిన మానసిక, శారీరక ఎదుగదల లేని వికలాంగురాలైన బాలిక ఏకైక సంతానం. బాలిక మాటలు మాట్లాడలేని, కదల లేని స్థితిలో ఉంటుంది. ఆదివారం మద్యాహ్నం కూతురును గ్రౌండ్ ఫ్లోర్ లో నేలపై ఉంచి, కిరాణం సామాను కోసం తల్లి బయటకెళ్ళి, 20 నిమిషాల తర్వాత తిరిగి రాగా, బెడ్ పై బాలిక శరీరమంతా రక్తం ఉండటంతో ఆందోళన చెందిన తల్లి, స్థానికుల సహాకారంతో గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్ళి, ఎమర్జెన్సీ వార్డులో అడ్మిట్ చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు బాలిక ప్రైవేట్ పార్ట్ నుంచి బ్లీడింగ్ అవుతుండటంతో అత్యాచారానికి గురైనట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. విషయం ఆలస్యంగా తెలియడంతో అర్ధరాత్రి దాదాపు 12 గంటల ప్రాంతంలో ఏసీపీ శ్రీనివాస్, సీఐ శంకర్, ఎస్ఐ సుధాకర్ లు ఘటన స్థలానికి వెళ్ళి, వివరాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో గాలించారు. ట్రీట్మెంట్ చేస్తున్న డాక్టర్లతో మాట్లాడారు. రెండు రోజుల్లో బాలికకు ట్రీట్మెంట్ పూర్తి చేసి డిశ్చార్జ్ చేస్తామని డాక్టర్లు చెప్పినట్లు సీఐ తెలిపారు. ఇదే బిల్డింగ్ తో పాటు ఆవరణలో పలువురు బీహార్, తదితర రాష్ట్రాల కార్మికులు నివాసం ఉంటున్నట్లు సమాచారం. బాలిక ప్యారెంట్స్ ఫిర్యాదు మేరకు ఫోక్సో, అత్యాచారం కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్ తెలిపారు. నిందితులను త్వరలో పట్టుకొని అరెస్ట్ చేస్తామన్నారు. ఈ ఘటన బౌద్ధనగర్, వారాసిగూడ లో సంచలనమైంది. మానసిక వికలాంగురాలైన చిన్నారిపై అత్యాచారానికి ఒడిగట్టిన కామాందుడిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని అంతా డిమాండ్ చేస్తున్నారు.

## పోటీ చేయడానికి బీజేపీకి అభ్యర్థులు కరువు

### నిజం చెప్పిన బండి సంజయ్

### భారత జాగృతి కార్యదర్శి కొమ్ము నవీన్

హైదరాబాద్ జూన్ 12 (ప్రజామంటలు): ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు కరువైన పార్టీ భారతీయ జనతా పార్టీ అని, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వేములవాడ సభలో పరోక్షంగా వెల్లడించడం ఆపార్టీ డొల్లతనాన్ని తెలుపుతుందని భారత జాగృతి కార్యదర్శి నవీనా చారి అన్నారు.

అక్కడితో ఆగకుండా ఒకవేళ ఎవరైనా గెలిచిన వాళ్లు టిఆర్ఎస్ పార్టీలోకి వెళ్తారని తన మనసులోని మాటను బయటకు పెట్టారని, వేము లవాడలో నియోజకవర్గ బిజెపి సీనియర్ కార్యకర్తల సమ్మేళ నంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షులు బండి సంజయ్ మాట్లాడుతూ కేంద్ర మాజీ మంత్రి ప్రకాష్ జవదేకర్ ఇతర నాయకుల ముందే "తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ఉనికి లేదని, ఎక్కడ పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ గల్లంతవుతుందని విమర్శించారు. టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండు ఒకటే అని పేర్కొన్న ఆయన, ఇదే సమయంలో బిజెపి గురించి మాట్లాడుతూ పోటీ చేయడానికి అభ్యర్థుల కరువైన పార్టీ భారతీయ జనతా పార్టీ అని పేర్కొన్నారు.

అలాగే తప్పిపోయి ఎవరైనా గెలిచిన వాళ్లు కూడా బి ఆర్ఎస్ పార్టీలో చేరుతారని స్వయంగా బండి సంజయ్ సభాముఖంగా మాట్లాడిన తీరు ఒక్కసారిగా బిజెపి శ్రేణులను విస్మయానికి గురి చేసినా, ఆయన నిజం మాట్లాడారని నవీన్ పేర్కొన్నారు.

## సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ,జూన్12 :యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్ష-2023 ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. పీడీఎఫ్ ఫైల్ ఫార్మాట్‌లో మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థుల వివరాలను పొందుపరిచారు. ప్రిలిమ్స్ పరీక్షలో మొత్తం 14,624 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. మొత్తం 1105 పోస్టులకుగానూ సెప్టెంబరు 15 నుంచి మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు మెయిన్స్ పరీక్ష కోసం ఇప్పుడు మళ్లీ డిటైల్డ్ అప్లికేషన్ ఫామ్ - 1 లో దరఖాస్తు చేసుకోవాలని యూపీఎస్సీ తెలిపింది. ఇందుకు చివరి తేదీని కమిషన్ త్వరలోనే వెల్లడించనుంది. ప్రిలిమ్స్ కటాఫ్, ఆన్సర్ కీని సివిల్స్ సర్వీసెస్ పరీక్ష మొత్తం ప్రక్రియ పూర్తయిన తర్వాత వెల్లడించనున్నట్లు యూపీఎస్సీ తెలిపింది. సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మే 28న నిర్వహించిన సంగతి తెలిసిందే.

## దశాబ్ది ఉత్సవాల్లో మల్లారెడ్డి చిందులు
## వినూత్నంగా ఆకట్టుకున్న మంత్రి



హైదరాబాద్,జూన్12 : మంత్రి మల్లారెడ్డి ఎక్కడుంటే అక్కడ సందడే సందడి. మాటలతోనే కాదు.. ఆటతోనూ అలరిస్తుంటారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో వినూత్న వేషధారణలు కార్యక్ర మాలతో మంత్రి మల్లారెడ్డి అందరినీ ఆకట్టుకుంటున్నారు. తెలంగాణ రన్ లో భాగంగా ఫీర్జాది గూడ మున్సిపల్ కార్పొరేషన్ చెంగిచెర్ల చౌరస్తాలో నిర్వహించిన 5ఐ రన్ కార్యక్రమంలో మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన స్టెప్పులు ఇరగదీస్తూ తెగ హైలైట్ అయ్యారు. ఇక అక్కడ యువతీయువకుల నడుమ చిందేస్తూ సందడి చేశారు. అంతేనా? విజేతలకు ఇచ్చే ట్రోఫీ పట్టుకొని చిందులు వేస్తూ యువతలో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం మహిళా కళాకారులతో బతుకమ్మ పాటలకు ఆడి పాడారు. 70 ఏళ్ల వయసులో సైతం మల్లారెడ్డి స్టెప్పులతో అదరగొట్టడం అందరినీ ఆకట్టుకుంటోంది.

## బిజెపికి ఏం అర్హ ఉందని వస్తోంది
## ఘాటు విమర్శలు చేసిన రామకృష్ణ

అమరావతి,జూన్12 : ఏపీలో ప్రచారం చేసేందుకు బీజేపీకి సిగ్గుండాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఘాటువ్యాఖ్యలు చేశారు. ఏ మొహం పెట్టుకుని ఇక్కడికి వస్తారని, ఈకు ఏ అర్హత ఉందని బిజెపి నేతలపై మండిపడ్డారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు అమమకం, విభజన హామీలపై ఎందుకు మాట్లాడరని అన్నారు. ఎపికి ద్రోహం చేసిన పార్టీ బిజెపి అన్నారు. దేశ అప్పులను రూ.155 లక్షల కోట్లకు చేర్చినందుకు మోడీ గ్లోబల్ లీడర్ అయ్యారా? అని ప్రశ్నించారు. 67 ఏళ్లలో ప్రభుత్వాలు చేసిన రూ.55 లక్షల కోట్ల అప్పులకన్నా, 9 ఏళ్ల మోడీ పాలనలో చేసిన అప్పు రెండింతలన్నారు. నిరుద్యోగాన్ని పెంచినందుకా?.. 27 మంది గుజరాత్ వాళ్ళు బ్యాంకులకు అప్పులు ఎగ్గొట్టి పారిపోయినందుకా?.. అదానీ, అంబానీలకు వూడిగం చేస్తున్నందుకా?.. ఎందుకు నరేంద్ర మోడీ గ్లోబల్ లీడర్ అయ్యారని నిలదీశారు. ఏపీకి రాజధాని లేదని అమిత్ షా చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో అవినీతి పరిపాలన జరుగుతుంటే కేంద్రంలో హోంమంత్రి స్థానంలో ఉండి గత 4 ఏళ్లుగా ఎందుకు చర్యలు తీసుకోలేదని అడిగారు. అవినాష్ రెడ్డిని అరెస్టు చేయలేని దద్దమ్మగా సీబీఐ వ్యవహరించడం వెనుక అమిత్ షా పాత్ర లేదా అని ప్రశ్నించారు. సీబీఐ అమిత్ షా కనుసన్నల్లో నడుస్తోందని ఆయన ఆరోపించారు.

## ప్రయోగ శాలగా విద్యావ్యవస్థ
## జగన్ తీరుపై మండిపడ్డ జవహర్

అమరావతి,జూన్12:జగన్ పాలనలో చదువు బదుల నుంచి పారిపోయిందని మాజీ మంత్రి జవ హర్ అన్నారు. విద్యారంగాన్ని నీరుగార్చిన సిఎంగా జగన్ మిగిలిపోతాడని అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... విద్యావ్యవస్థ ప్రయోగశాలగా మారిపోయిందన్నారు. జగన్ బడిని కూడా రాజకీయాలకు వేదిక చేయటం సరికాదని మండిపడ్డారు. డీఎస్సీ లేకుండా విద్య ఎలా సాధ్యమో జగన్ చెప్పాలన్నారు. బడి బయట పిల్లలను బడికే కాకుండా ఊర్లకు దూరం చేసిన ఘనుడు జగన్ అని వ్యాఖ్యలు చేశారు. కిట్ల నాణ్యతే కాదు విద్య కూడ నాసిరకం అందించాలని జగన్ ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నాడు బాబు పాలనల చదువుకు విలువ ఉందని.. నేడు చదువు నేతి బీరకాయలో నెయ్యిలా ఉందన్నారు. పాటశాలలు విలీనం పేరుతో మూతపడ్డా యని.. విద్యావిధానం జగన్ చేతిలో నలిగిపోతుందని తెలిపారు. ఎయిడెడ్ పాటశాలలు డెడ్ అయిపోయాన్నారు. ఎయిడెడ్ పాటశాలల స్థలాలపై ఉన్న శ్రద్ధ సిబ్బంది నియామకాలపై లేదన్నారు. జగన్ విద్యను చెరపట్టటం దురదృష్టమన్నారు. ప్రజలు మేలుకొని వ్యవస్థను కాపాడుకోవాలని సూచించారు. జగన్ విద్యార్థుల పట్ల నిజాయితీగా వ్యవహరించాలన్నారు. నేరస్తుల నుంచి విద్యార్థులు ఏమి నేర్చుకుంటారో జగన్ చెప్పాలని జవహర్ డిమాండ్ చేశారు.

## పిల్లలందరినీ బడికి పంపాలి
## బాల కార్మిక వ్యతిరేకంగా ర్యాలీ
### జెండా ఊపిని కలెక్టర్ హరి నారాయణన్

నెల్లూరు,జూన్12 : చదివే వయస్సులో వున్న పిల్లలను బడికి పంపే కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ చేపట్టాలని జిల్లా కలెక్టర్ యం. హరి నారాయణన్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కార్మిక శాఖ , స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ర్యాలీని కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ యం. హరి నారాయణన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ, సామాజిక బాధ్యతతో చదివే వయస్సులో వున్న పిల్లలను బడికి పంపే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. విద్య ద్వారానే సాధికారత సాధ్యమౌతుందన్న విషయాన్ని గుర్తించి బడి ఈడు పిల్లలందరిని పని కోసం ఉపయోగించకుండా చదివించాలన్న లక్ష్యంతో ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్న ఉద్దేశ్యంతో ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. అందులో భాగంగా ఈ రోజు కలెక్టరేట్ నుండి గాంధీ బొమ్మ వరకు ర్యాలీని నిర్వహించుకోవడం జరుగుచున్నదన్నారు. జిల్లాలో వున్న ప్రతి పౌరుడు బడి ఈడు పిల్లలను పని కోసం ఉపయోగించకుండా బడికి పంపే కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. బడి ఈడు పిల్లలను పని కోసం ఉపయోగిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్మిక శాఖ డిప్యూటీ కమీషనర్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ, కార్మిక శాఖ , స్త్రీ శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ వెల్ఫేర్ సొసైటీ, వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ నెల 1వ తేదీ నుండి ఈ నెలాఖరు వరకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుండి బడి ఈడు పిల్లలను పనిలో ఉపయోగిస్తున్న 10 మంది పై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా చైల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రచురించిన వాల్ పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.పిల్లలు పనిలో కాకుండా బడిలో వుండాలి, పిల్లలు బడికి - పెద్దలు పనికి, పిల్లలు చదువుకోవడానికి, ఆడుకోవడానికి ఒక్క అవకాశం కల్పించండి, పిల్లల చదువే - ప్రగతికి ముద్దు, పిల్లల హక్కులను కాపాడండి - వారి భవిష్యత్తు కు బంగారు బాట వెయ్యండి వంటి నినాదాలు చేస్తూ ఈ ర్యాలీ కలెక్టర్ కార్యాలయం నుండి గాంధీ బొమ్మ సెంటర్ వరకు నిర్వహించగా, ఈ ర్యాలీ లో కార్మిక శాఖ డిప్యూటీ కమీషనర్ ఎం. వెంకటేశ్వర రావు, అసిస్టెంట్ కమీషనర్ గౌస్ బాషా, ఐసీడీఎస్ పిడి సౌజన్య, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సురేష్, చైల్డ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, కార్మిక శాఖ, ఐసీడీఎస్ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ పోలీసుల సేవలు భేష్
## విప్ పాడి కౌశిక్ రెడ్డి



హుజురాబాద్ జూన్ 12 (ప్రజామంటలు): ఫ్రెండ్లీ పోలీసు విధానంతో తెలంగాణ పోలీసుల సేవలు భేష్ అని శాసన మండలి విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలో తెలంగాణ ప్రశాంత్ ఉత్సవాల వేడుకల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన టు కె రన్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పోలీసు వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆ శాఖకు నిధులు కేటాయించి సమస్యలు తగ్గించిందని అన్నారు. పోలీసులు విధులు నిర్వహించడానికి గాను వారికి వాహనాలను ఇవ్వడం, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం కోసం షీ టీం లను ఏర్పాటు చేయడం, సంఘటన జరిగిన సమయానికి వేగంగా వెళ్లడం కోసం బ్లూ కోట్ పోలీసు పద్ధతి, ఫిర్యాదు చేయడానికి వచ్చిన ప్రజలకు గౌరవంగా సేవలందించడానికి ఫ్రెండ్లీ పోలీసు పద్ధతిని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. నేరాల అదుపులో ఇతర రాష్ట్రాల కన్నా మన రాష్ట్ర పోలీసులు వేగంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, జడ్పీ చైర్ పర్సన్ కనుమల విజయ, మున్సిపల్ చైర్ పర్సన్ గంధ రాధిక, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, హుజురాబాద్ టౌన్ సిఐ బొల్లం రమేష్, ఎస్సై రాజన్న మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండాల్ రెడ్డి కౌన్సిలర్లు ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘ సభ్యులు, వివో లు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ఉద్యోగులు, పోలీసులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

### మంత్రి కొప్పుల ఈశ్వర్ - ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డిల
## బహిరంగ చర్చకు మేము కూడా సిద్ధం

**ప్రజలను ఎవరు తప్పు ద్రోవ పట్టిస్తున్నారో తేల్చాలి**

**మంత్రి బహిరంగ చర్చకు వేదిక ఏర్పాటు చేయాలి**

**అవకాశం ఇచ్చి అందరినీ ఆహ్వానించాలి**

**తె.జ.స. జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి**



జగిత్యాలజూన్ 12 (ప్రజా మంటలు): తెలం గాణ రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ - పట్ట భద్రుల ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి ల మధ్య జరుగనున్న బహిరంగ చర్చకు మేము కూడా సిద్ధమే అని తెలంగాణ జన సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి ప్రకటిం చారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.... గత నాలుగు రోజులుగా ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలలో కొనసాగుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్ సవాల్, ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి ల ప్రతి సవాల్ ను మేము కూడా స్వచ్ఛందంగా స్వీకరిస్తున్నామని ఆయన తెలిపారు. వీరిద్దరిలో ప్రజలను ఎవరు తప్పుద్రోవ పట్టిస్తున్నారో, ఎవరు మభ్య పెడుతున్నారో తేల్చాల్సిన బాధ్యత కూడా మంత్రి కొప్పుల ఈశ్వర్ పై, ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి లపై ఉందన్నారు. ఈవిషయంలో వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిన సమయం, సందర్భం కూడా ఆసన్నమైందని చుక్క గంగారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రిగా, జగిత్యాల జిల్లా మంత్రిగా, ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యే గా బాధ్యతలు వహిస్తున్న కొప్పుల ఈశ్వర్ వెంటనే ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో గానీ, జిల్లా కేంద్రంలో గానీ వేదిక ఏర్పాటు చేసి అందరినీ ఆహ్వానించి, వీరిద్దరి మధ్య జరిగిన ఆరోపణలపై బహిరంగ చర్చ నిర్వహించాలని చుక్క గంగారెడ్డి కోరారు. వేదిక ఏర్పాటు చేయాల్సిన బాధ్యత సవాల్ విసిరిన మంత్రి కొప్పుల ఈశ్వర్ దేనని ఆయన సూచించారు. అవకాశం ఇస్తే అన్ని విషయాలపై బహిరంగంగా చర్చించడానికి తెలంగాణ జనసమితి సిద్ధంగా ఉందని చుక్క గంగారెడ్డి స్పష్టం చేశారు.

## అభివృద్ధికి చిరునామాగా అక్కన్నపేట మండలం
### ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్




అక్కన్నపేట జూన్ 12 (ప్రజామంటలు): అక్కన్నపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లా డుతూ.... తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత పరిపాలన సౌల భ్యం కోసం సంక్షేమ ఫలాలు ప్రతి గడప, గడపకు అందాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కొత్త జిల్లాలను, కొత్త మండలాలను నెలకొల్పారు తద్వారా అధికార వికేంద్రీకరణ జరిగి పరిపాలన సులభమైందని అలా హుస్నాబాద్ నియోజకవర్గంలో ఏర్పడిన కొత్త మండలం అక్కన్న పేట ఇప్పుడు అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి 1,06,000 ఎకరాలకు సాగునీరు అందించే బృహత్తరమైన ప్రాజెక్టు గౌరవెల్లి కూడా ఈ మండలంలో ఉంది. త్వరలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా గౌరవెల్లి ప్రాజెక్టును ప్రారంభిస్తామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ ఆఫీసుల కోసం ఐదు ఎకరాల స్థలం కేటాయించడం జరిగిందని త్వరలో నిర్మాణం ప్రారంభిస్తామని, అలాగే మండలంలోని అంతక పేటలో వ్యవసాయ సబ్ మార్కెట్ కోసం 9:20 ఎకరాలు కేటాయించడం జరిగిందని పనులు ప్రారంభం అవుతాయని ,అక్కనపేటలో కొత్త పోలీస్ స్టేషన్ నిర్మాణం చేసుకున్నామని, రేగొండ మల్లంపల్లి గ్రామాలలో కొత్త సబ్ స్టేషన్లు మంజూరయ్యాయని మండలంలో ప్రతి గ్రామంలో అన్ని విధాలుగా అభివృద్ధి జరిగి రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి భూక్యా మంగా శ్రీనివాస్, గుగిలోతు లక్ష్మి భీ లు నాయక్, హుస్నాబాద్ కమిటీ చైర్మన్ ఎడవెల్లి రజినీ, అధికారులు వివిధ గ్రామాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ లో కిరాణా వర్తక సంఘం వివాదం




**కొత్త కమిటీకి లెక్కలు అప్పగించాలి**

హుజురాబాద్ జూన్ 12 (ప్రజామంటలు): హుజురాబాద్ కిరా ణా వర్గక సంఘం లెక్కలు, బాధ్యతలు వెంటనే కొత్త కమిటీకి అప్పగించాలని అధ్యక్షుడు శీల రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేసారు. సోమవారం హుజురాబాద్ పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. కిరాణా వర్తక సంఘానికి ఎన్నికలు జరిగి చాలాకాలమైనా పాత అధ్యక్షుడైన చందా గాంధి సంఘం లెక్కలను అందులోని డబ్బు లను, అలాగే బాధ్యతలను తమకు ఇప్పటివరకు అప్పగిం చలేదని మాట్లాడారు. ఈ విషయమై పలు సార్లు అడిగినప్పటికీ పట్టించుకోవడం లేదని, తానే అధ్యక్షుడినని చెప్తున్నారని, కొత్త కమిటీ ఎన్నిక చెల్లదని అంటున్నారని తెలిపారు. రెండు సార్లు ఆయన నిర్వహిస్తున్న రెస్టారెంట్ వద్దకు వెళ్లి ఈ విషయం అడిగామన్నారు. కిరాణా వర్తక సంఘానికి డిసిఎమ్మెస్ కాంప్లెక్సులో షెట్టర్లు ఉన్నాయని, వీటికి సంబంధించిన రూ. 6 లక్షల లెక్క చెప్పాల్సి ఉందని, సంబంధించిన ఆదాయం ఏం చేసారో చెప్పాల్సి ఉందన్నారు. చందా గాంధీ రాజీనామా చేసి తనకు రాజీనామా పత్రం కూడా సమర్పించారని, కొత్త కమిటీ ఎన్నికలో తనను బలపర్చారని, ఎన్నికలో ఓటు చేసారని తదనంతరమే కొత్త కమిటీ ఎన్నిక జరిగిందని స్పష్టం చేసారు. గాంధీ కంటే ముందు పనిచేసిన అధ్యక్షులు కూడా కొత్త కమిటీకి లెక్కలు, బాధ్యతలు అప్పగించారని వెల్లడించారు. కానీ చందా గాంధీ తానే అధ్యక్షుడినని చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. ఈ విషయమై హుజురాబాద్ సి ఐ కూర్చుని మాట్లాడుకోవాలని చెప్పారని అయినా పట్టించుకోకపోగా తమను దుర్భాషలాడారని వివరించారు. వెంటనే చందా గాంధి బేషరతుగా తమకు క్షమాపణలు చెప్పాలని, కొత్త కమిటీకి లెక్కలు, బాధ్యతలు అప్పగించాలని అయన డిమాండ్ చేసారు. ఈ విలేకరుల సమావేశంలో కార్యదర్శి శశిధర్, సభ్యులు కృష్ణమూర్తి, ప్రభాకర్, మహేష్ శ్రవణ్, సాగర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గోవధ నిషేధ చట్టం కఠినంగా అమలు చేయాలి

**విశ్వహిందూ పరిషత్ డిమాండ్**

**హిందువుల పవిత్ర దైవం గోవు**

**గోవును వధించడం మహా పాపం**

**గోవధ నిషేధ చట్టం కఠినంగా అమలు చేయాలి**

**ఈనెల 14న ఇందిరాపార్క్ దగ్గర మహా ధర్నా**




హైదరాబాద్ జూన్ 12 (ప్రజామంటలు): రాజకీయ పార్టీలకు అతీతంగా హిందువులు కదలి రావాలని, తెలంగాణ రాష్ట్రంలో గోహత్య నిషేధ చట్టాలు కఠినంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. పాడి పరిశ్రమకు, వ్యవసాయానికి, గ్రామీణ జీవన విధానానికి వెన్నెముకగా ఉన్న పశువులను చట్ట వ్యతిరేకంగా హత్యలు చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేసింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పండరీనాథ్, గోరక్ష దక్షిణ భారత ప్రముఖ్ యాదగిరి రావు, గోరక్ష తెలంగాణ రాష్ట్ర సహ ప్రముఖ్ జి రమేష్, ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివ రాములు విలేకరులతో మాట్లాడారు.

**ముక్కోటి దేవతలకు నిలయమైన గోవు:**

హిందువుల పరమ పవిత్రమైన గోవు దైవమన్నారు. గోవును వధిస్తే మహా పాపమని పేర్కొన్నారు. ప్రతి ఏడాది బక్రీద్ సందర్భంగా రాష్ట్రంలో విచ్చలవిడిగా గో హత్యలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి పనికి వచ్చే పశువులను క్రూరంగా వధిం చడం చట్టరీత్యా నేరమైనప్పటికీ, హత్యలను ఆపడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతుందని ఆరోపించారు. ఈనెల 14వ తేదీన ఇందిరాపార్కు దగ్గర మహా ధర్నా నిర్వహిస్తామని, ఎట్టి పరిస్థితులలో ఒక్క గోవును కూడా అక్రమంగా వధించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఇందిరాపార్క్ దగ్గర బుధవారం నిర్వహించే ధర్నా కార్యక్రమానికి ప్రతి హిందువు కదలి రావాలని వారు పిలుపునిచ్చారు.

## ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం
### పోస్టర్ ఆవిష్కరించిన సిఐడి అడిషనల్ డిజిపి

విజయవాడ,జూన్12 : ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం ' సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పోలీస్ నేర దర్యాప్తు విభాగము సి.ఐ.డి వారు ఈ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కొరకు 'ఆపరేషన్ స్వేచ్ఛ-ఎఎ' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఒక నెల రోజులు పాటు అనగా ఈనెల 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు అన్ని జిల్లాల్లోని పోలీస్ మరియు ఇతర శాఖల సమన్వయంతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సి .ఐ.డి ప్రధాన కార్యాలయం మంగళగిరిలో సి.ఐ.డి. అడిషనల్ డి.జి.పి. సంజయ్,బాల కార్మికు లకు వ్యతిరేకంగా ఒక పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. మాట్లాడుతూ, ఈ ఆపరేషన్ స్వేచ్ఛా ఫేజ్-1కి కొనసాగింపు. ఫేజ్-ఎ సమ యంలో, పిల్లలను రక్షించడానికి గణనీయ మైన ప్రయత్నాలు చేసింది, దీనికి ఉన్నతాధికారులు మరియు ప్రభుత్వం నుండి ప్రశంసలు లభించాయని తెలియజేసారు,

## సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు
### స్పందన వేదికలో మేయర్, కమిషనర్

నెల్లూరు,జూన్12 : ప్రజా సమస్యల పరిష్కార వేదికగా జరుగుతున్న స్పందన కార్యక్రమంలో అందుకున్న విజ్ఞప్తులకు నిబద్ధతతో పరిష్కారాలు అందించాలని, సమస్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ మేయర్ పి.స్రవంతి, కమిషనర్ వికాస్ మర్మత్, ఐ.ఏ.యస్ లు సూచించారు. కార్యాలయంలోని ఎ.పి.జె అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన స్పందన వేదికలో కమిషనర్ పాల్గొని 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్ ను నేరుగా మాట్లాడారు. వివిధ సమస్యలపై వచ్చిన 12 ఫిర్యాదులను కమిషనర్ సంబంధిత విభాగం అధికారులకు తెలియజేసి సూచించిన గడువులోపు నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు. అనంతరం మేయర్ తో కలిసి ప్రజలనుంచి నేరుగా అర్జీలను కమిషనర్ స్వీకరించారు. అందుకున్న సమస్యలకు నిర్దిష్ట గడువులోపు పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను వారు ఆదేశించారు. సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని తెలిపారు.జగనన్నకు చెపుదాం 1902, స్పందన, ఎ.పి సేవా పోర్టల్ లను నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతిరోజూ పరిశీలించుకోవాలని, ఫిర్యాదులు పెండింగులో లేకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. సచివాలయాల స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను సంబంధిత కార్యదర్శులు పరిష్కరించాలని ఆదేశించారు. నగర పాలక సంస్థ సంబంధిత విభాగం అధికారి, సచివాలయ కార్యదర్శి నేరుగా ఫిర్యాదుదారుని కలిసి శాశ్వత పరిష్కారం అందించి, సమస్య పునరావృతం కాకుండా కృషి చేయాలని సూచించారు. స్పందన వేదికలో అందించే ఫిర్యాదుల సంఖ్యను తగ్గించేందుకు అధికారులంతా సమన్వయంతో పని చేయాలని సూచించారు. అన్ని విభాగాల ఉన్నతాధికారులు తమ విభాగాల పనితీరును మెరుగుపరిచేందుకు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. విభాగాల ఉన్నతాధికారులు వారంలో తమకు కేటాయించిన సచివాలయం లోని 4 సచివాలయాలను తప్పనిసరిగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించాలని, నోటీసు బోర్డుల ద్వారా సమాచారం ప్రజలకు అందేలా పర్యవేక్షించాలని మరియు పరిశీలించిన పిమ్మట సదరు పర్యవేక్షణ రిమార్కులని ఇన్స్పెక్షన్ రిజిస్టర్ నందు నమోదు చేయవలసినదిగా అధికారులను కమిషనర్ ఆదేశించారు.స్పందన వేదికలో అందుకున్న అన్ని సమస్యలకు పారదర్శకమైన పరిష్కారాన్ని, సూచించిన గడువులోపు అందించేందుకు అన్ని విభాగాల అధికారులు కృషి చేయాలని కమిషనర్ కోరారు.

# ప్రేక్షకుల్లో ఆదిపురుష్ మేనియా

## ఖమ్మం జిల్లాలో రామాలయానికో వంద టిక్కెట్లు



**ఆది**పురుష్ వీక్ స్టార్ట్ అయిపోయింది. మరో నాలుగు రోజుల్లో ప్రభాస్ ఫ్యాన్స్ ఎదురు చూపులకు తెర పడబోతుంది. ఇప్పటికే బుకింగ్స్ స్టార్ట్ అయిపోయాయి. హాట్ కేకుల్లా టిక్కెట్స్ అమ్ముడవుతున్నాయి. టీజర్ తో ఎక్కడలేని ట్రోల్స్ ఎదుర్కొన్న చిత్రబృందం ట్రైలర్ సహా రెండు పాటలకు ఎక్కడలేని రెస్పాన్స్ వచ్చింది. టీజర్ వచ్చిన నెగెటివిటీ అంతా పటాపంచలైంది. ఇక మొన్న విడుదలైన యాక్షన్ ట్రైలర్ సైతం అందరినీ తెగ ఆకట్టుకుంటుంది. విజువల్ వండర్ లా ఉండబోతుందని స్పష్టం అయింది. నెలన్నర రోజులుగా సరైనా సినిమాలేక సతమతవుతున్న సినీ లవర్స్ కు ఆదిపురుష్ మంచి ఉత్సాహాన్నిస్తుంది. ఇప్పుడున్న హైప్ కు ఏమాత్రం పాజిటీవ్ టాక్ వచ్చినా బాక్సాఫీస్ దగ్గర తొలిరోజే వంద కోట్ల మార్క్ దాటడం పెద్ద విషయం కాదు. ఇక ఇదిలా ఉంటే నటుడు రణ్ బీర్ కపూర్, నిర్మాత అభిషేక్ అగర్వాల్ ఇప్పటికే అనాథ పిల్లల కోసం పదివేల చొప్పున టిక్కెట్లు ఉచితంగా ఇవ్వబోతున్నట్లు తెలిపారు.కాగా తాజాగా శ్రేయస్ మీడియా కూడా ఉచితంగా టిక్కెట్లు ఇవ్వబోతున్నట్లు ప్రకటించింది. ఖమ్మం జిల్లాలోని ప్రతి గ్రామంలో, ప్రతి రామాలయానికి ఉచితంగా 101 టిక్కెట్లు ఇవ్వదలుచుకున్నట్లు శ్రేయస్ అధినేత శ్రీనివాస్ తెలిపాడు. రామయాణం ఇతిహాసం నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాకు ఓంరౌత్ దర్శకత్వం వహించాడు. ప్రభాస్ రాముడి పాత్ర పోషించగా.. కృతిసనన్ సీతగా కనిపించనుంది. బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ లంకాధిపతి రావణాసురుడుగా కనిపించనున్నాడు. రెట్రోఫిల్స్, టీ సిరీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాకు దాదాపు రూ.500 కోట్లు ఖర్చయింది. ఇక ఇప్పటికే ప్రొడ్యూసర్లకు థియేట్రికల్, నాన్ థియేట్రికల్ రూపంలో మొత్తం ముట్టాయని తెలుస్తుంది. తెలుగులో ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ రిలీజ్ చేస్తుంది.

# పవన్ ఓజీపై భారీ అంచనాలు




పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అందరూ ప్రస్తుతం ఓజీ నామమే జపం చేస్తున్నారు. ఒక్క ప్రీ లుక్ పోస్టర్ తోనే సినిమాపై తిరుగులేని హైప్ వచ్చింది. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఈ సినిమాకు సంబంధించి ఏ చిన్న అప్డేట్ వచ్చినా అది క్షణాల్లో వైరల్ అవుతుంది. పైగా ఈ సినిమాలో పవన్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపిస్తున్నాడు. అప్పుడెప్పుడో పుష్కర కాలం ముందు పవన్ 'పంజా'లో గ్యాంగ్‌స్టర్‌గా కనిపించాడు. మళ్లీ ఇనేళ్ల తర్వాత గ్యాంగ్‌స్టర్ పాత్ర చేస్తుండటంతో సినిమాపై ఎక్కడలేని హైప్ క్రియేట్ అయింది. అంతేకాకుండా ఈ సినిమాలో పవన్ మూడు విభిన్న వేరియేషన్స్ లో కనిపించనున్నట్లు టాక్. ఇదిలా ఉంటే ఈ సినిమాకు సంబంధించిన ఓ క్రేజీ న్యూస్ నెట్టింట తెగ వైరల్ అవుతుంది. ఊగా ఈ సినిమా కోసం సుజీత్ పవర్ ఫుల్ ఇంట్రో ప్లాన్ చేస్తున్నాడు. ఇప్పటివరకు పవన్ సినిమాల్లో అలాంటి ఇంట్రో లేదట. ఇప్పటికే దానిపై కసరత్తులు కూడా స్టార్ట్ చేశాడట. ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాలో ఖైదీ ఫేమ్ అర్జున్ దాస్ కీలకపాత్ర పోషిస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ సినిమాకు ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్ అనే టైటిల్‌ను ఫిక్స్ చేసినట్లు తెలుస్తుంది. ఆర్ఆర్ఆర్ వంటి ఇండస్ట్రీ హిట్‌ను నిర్మించిన దానయ్య ఈ సినిమాకు ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ సినిమా కోసం పవన్ 60రోజుల కాల్షీట్లు ఇచ్చాడని తెలుస్తుంది. ఇక ఈ ఏడాది చివరి కల్లా టాకీ పార్ట్ పూర్తి చేసి వచ్చే ఏడాది ప్రథమార్ధంలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

## మాయపేటిక నుంచి సాయోనారె పాట విడుదల

**వి**రాజ్ అశ్విన్, పాయల్ రాజ్‌పుత్, సిమ్రత్ కౌర్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'మాయా పేటిక'. రమేశ్ రాపర్తి దర్శకుడు. మాగుంట శరత్ చంద్ర రెడ్డి, తారక్‌నాథ్ బొమ్మిరెడ్డి నిర్మాతలు. ఈ చిత్రం నుంచి 'సాయొనారా.. ఇన్నాళ్ల కలలకు సాయొనారా' అనే గీతాన్ని విడుదల చేశారు. శ్రీమణి రాసిన పాట ఇది. హారికా నారాయణన్ పాడారు. గుణ బాలసుబ్రమణియన్ సంగీతం అందించారు. 'హుషారైన గీతమిది. బ్యాచిలర్ లైఫ్‌కి స్వస్తిపలుకుతూ కథానాయిక పాడుకొంటుంది. పాటే కాదు.. విజువల్స్ కూడా బాగుంటాయి. పాయల్‌కి ఓ కొత్త ఇమేజ్ తీసుకొస్తుంది. కథ, కథనాలు ఆసక్తికరంగా సాగుతాయి. ఈనెల 30న విడుదల చేస్తున్నామని దర్శక నిర్మాతలు తెలిపారు.

## రిలీజ్‌కు రెడీగా ఉన్న రెజీనా

**ప**ద్దెనిమిదేళ్ల క్రితం వచ్చిన 'కుమార్ వర్సెస్ కుమారి' సినిమాతో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది



తమిళ బ్యూటీ సునయన. ఈ తర్వాత 'సమ్ థింగ్ స్పెషల్', 'టెన్త్ క్లాస్' ఇలా తెలుగులోనే తొలి మూడు సినిమాలు చేసింది. ఆ తర్వాత తమిళంలోకి ఎంట్రీ ఇచ్చి ఇప్పుడు బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో తెగ బిజీగా గడపుతుంది. ప్రస్తుతం ఈ బ్యూటీ 'రెజీనా' అనే పాన్ ఇండియా సినిమా చేస్తుంది. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్లు సంచలనం సృష్టించాయి. రివేంజ్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు డామిన్ డీ సెల్వా దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ ను చిత్రబృందం ప్రకటించింది. సినిమాను జూన్ 23న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ఓ సరికొత్త పోస్టర్ ను రిలీజ్ చేశారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా రిలీజ్ కాబోతుంది. అయితే ఈ సినిమా రిలీజ్ కు వారం ముందు ఆదిపురుష్ విడుదల కాబోతుంది. ఆదిపురుష్ కు మంచి టాక్ వస్తే దాని ఎఫెక్ట్ కనీసం మూడు వారాలైన ఉంటుంది. కాగా ఈ లెక్కన చూసుకుంటే రెజీనా సినిమా గట్టి పోటిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. అనంత్ నాగ్, నివాస్ ఆదితన్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాను ఎల్లో బేర్ బ్యానర్ పై సతీష్ నిర్మించాడు. అంతేకాకుండా సతీష్ ఈ సినిమాకు స్వయంగా సంగీతం కూడా అందించాడు.

## కండక్టర్‌గా మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్



ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్లలో ఒకడు అనిరుధ్ రవిచందర్. బ్యాక్ టు బ్యాక్ భారీ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న ఈ యువ సంగీత దర్శకుడు. స్టార్ హీరోల సినిమాలు చేస్తూ తీరిక లేకుండా ఉన్న అనిరుధ్ తాజాగా సరికొత్త అవతారంలోకి మారిపోయాడు. సంగీత వాయిద్యాలతో కసరత్తు చేసే అనిరుధ్ ఈ సారి మాత్రం కండక్టర్‌గా మారిపోయా డు. కండక్టర్ డ్రెస్ కోడ్‌లో ఉన్న అనిరుధ్ నోట్లో విజిల్ పెట్టుకుని.. ఫుట్ బోర్డుపై నిలబడి రైట్ రైట్ అంటోన్న స్టిల్స్ ఇప్పుడు నెట్టింట్లో ట్రెండింగ్ అవుతున్నాయి.ఇంతకీ అనిరుధ్ రవిచందర్ ఇలా మారడానికి కారణమేమై ఉంటుందా..? అని తెగ ఆలోచిస్తున్నారు సినీ జనాలు. అనిరుధ్ కంపోజ్ చేస్తున్న చిత్రాల్లో రజినీకాంత్ నటిస్తోన్న జైలర్ కూడా ఒకటి. అనిరుధ్ బస్ కండక్టర్ నుంచి సూపర్ స్టార్‌గా మారిన తలైవాను స్ఫూర్తిగా తీసుకుని.. ఇలా మారడానికి వెనక సీక్రెట్ ఏమై ఉంటుందా..? అనేది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. ఈ స్టిల్స్ చూసిన అభిమానులు అని రుధ్ తలైవా 170 లో ఏమైనా నటిస్తున్నాడా..? ఏంటీ అని చర్చించుకుంటున్నారు.ప్రస్తుతం అని రుధ్ చేస్తున్న సినిమాలన్నీ దాదాపు భారీ బ్జడెట్ సినిమాలే. శంకర్-కమల్ హాసన్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఇండియన్ 2. తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ నటిస్తున్న జైలర్ , విజయ్-లోకేశ్ కనగరాజ్ కాంబోలో వస్తున్న లియో, ధనుష్ 50, అట్లీ-షారుఖ్ ఖాన్ కాంబోలో వస్తున్న జవాన్, కొరటాల శివ-జూనియర్ ఎన్టీఆర్ కాంబోలో వస్తున్న ఎన్టీఆర్ 30, విజయ్ దేవరకొండ-గౌతమ్ తిన్ననూరి, శివకార్తికేయన్, అజిత్ కుమార్ సినిమాలకు మ్యూజిక్ అందిస్తున్నాడు.

## మధు మంతెన మ్యారేజీలో బన్నీ సందడి



బాలీవుడ్ అగ్ర నిర్మాత మధు మంతెన వివాహం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. ప్రముఖ యోగా ట్రైనర్ ఐరా త్రివేదిని ఆయన వివాహం చేసుకున్నారు. ఆ పెళ్లికి టాలీవుడ్ నుంచి అల్లు అర్జున్ హాజరయ్యారు. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఆ పెళ్లికి వచ్చిన బాలీవుడ్ హీరోలు ఆమిర్ ఖాన్, హృతిక్ రోషన్‌లతో కలిసి సందడి చేశారు. ముగ్గురు కలిసి సరదాగా ముచ్చటించుకున్నారు. వీళ్ల ముగ్గురు దిగిన ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఫ్యాన్ వీటిని విపరీతంగా షేర్ చేస్తున్నారు. 'పుష్ప'తో అల్లు అర్జున్ దక్షిణాదిలోనే కాకుండా ఉత్తరాదిలోనూ భారీగా అభిమానులను సంపాదించుకున్నారు. ఆయనతో సినిమాలు తీయడానికి దర్శకనిర్మాతలు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో అల్లు అర్జున్ ఓ బాలీవుడ్ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. 'పుష్ప 2' పూర్తి కాగానే ఆ సినిమా పట్టాలెక్కే అవకాశం ఉంది మధు మంతెనతో కలిసి అల్లు అరవింద్ 'రామాయణం' సినిమాను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పనులు మొదలయ్యాయి.

# ఆసీస్‌దే డబ్ల్యూటీసీ ట్రోఫీ

- అంచనాలను అందుకోలేక పోయిన టీమిండియా
- పేలవ ప్రదర్శనతో వరుసగా రెండోసారీ ఓటమి



**లండన్,జూన్12 :** టీమిండియా టీమ్ వర్క్ కనిపించలేదు. అద్భుత ఫామ్‌లో ఉన్నారంటూ వచ్చిన విశ్లేషణలను దెబ్బకొట్టారు. ఆసిస్ ఆటముందు దిగదుడుపు అని నిరూపించారు. అందుకే ఎలాంటి అద్భుతమూ జరక్కుండానే ఆసిస్ సత్తా చాటింది. గొప్ప స్టార్ల నుంచి కోట్లాది క్రికెట్ ప్రేమికులు ఎంతో ఆశించినప్పటికీ ఆసీస్ బౌలర్ల ముందు బ్యాటెత్తేశారు. ఐపీఎల్‌లోనే తమ శక్తినంతా ధారబోసిన ఈ మిలియనీర్స్ క్రికెటర్లు ఏదో యథాలాపంగా ప్రతిష్ఠాత్మక డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అడుగుపెట్టినట్టుగా ఉంది. ఐదో రోజు ఏడు వికెట్లు చేతిలో ఉన్న వేళ కచ్చితంగా పోరాడతారనే అందరి అంచనా ఘోరంగా తప్పింది. కేవలం ఒక్క సెషన్‌లోనే అంతా వెనుదిరగడం భారత క్రీడాభిమానులను తీవ్రంగా నిరాశపర్చింది. దీంతో తొలి రోజు నుంచే అటు బ్యాటింగ్.. ఇటు బౌలింగ్‌లోనూ అదరగొట్టిన ఆస్ట్రేలియా సిసలైన చాంపియన్‌గా నిలిచింది. ఐసీసీకి సంబంధించిన అన్ని ట్రోఫీ (టీ20, వన్డే, టెస్టు, చాంపియన్స్ ట్రోఫీ)లను గెలుచుకున్న తొలి జట్టుగా నిలిచింది. వరుసగా రెండో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లోనూ టీమిండియా నిరాశపరిచింది. 444 పరుగుల కష్టసాధ్యమైన లక్ష్యంతో బరిలోకి దిగిన రోహిత్ సేనకు.. ఆఖరి రోజు 280 పరుగులు కావాల్సి ఉంది. క్రీజులో ఉన్న విరాట్ (49), రహానె (46)లపై భారీ ఆశలే పెట్టుకున్నా ఆ ఇద్దరూ ఉసూరుమనిపించారు. ఆసీస్ బౌలర్ల ధాటికి మిగతా వికెట్లు కూడా టపటపా నేలకూలడంతో భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 63.3 ఓవర్లలో 234 పరుగులకే ఆలౌటైంది. ఇంత భారీ ఛేదనలో కనీసం ఒక్క బ్యాటర్ నుంచి కూడా అర్ధసెంచరీ రాకపోవడం గమనార్హం. దీంతో 209 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించిన ఆస్ట్రేలియా..ఐసీసీ వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ గదను అందుకుంది. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 469, రెండో ఇన్నింగ్స్‌లో 270/8 స్కోరు వద్ద డిక్లేర్ చేయగా.. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 296 రన్స్ సాధించింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ట్రావిస్ హెడ్ నిలిచాడు. ఆదివారం ఐదో రోజు భారత జట్టు రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగడానికి ముందున్న సమీకరణమిది. విజయం వీలు కాకుంటే, కనీసం డ్రా కోసమైనా చివరి వరకు పోరాడగలరని అంతా భావించారు. కానీ ఆసీస్ బౌలర్ల ధాటికి వీరంతా అవుటయ్యేందుకు రెండు గంటలు కూడా పట్టలేదు. వాస్తవానికి పిచ్ ప్రమాదకరంగా కనిపించకపోగా.. క్రీజులో ఉన్న విరాట్, రహానె కూడా ఆరంభంలో ఇబ్బందిలేకుండా ఆడారు. కానీ తొలి ఆరు ఓవర్ల తర్వాతే సీన్ మారింది. ముందుగా 47వ ఓవర్లో పేసర్ బోలాండ్ ఝలక్ ఇస్తూ విరాట్‌ను దెబ్బతీశాడు. ఆఫ్‌సైడ్‌కు ఆవలగా వెళ్తున్న బంతిని టచ్ చేయగా దాన్ని రెండో స్లిప్‌లో ఉన్న స్మిత్ ఎడమ వైపునకు డైవ్ చేస్తూ రెండు చేతులతో ఒడిసి పట్టుకున్నాడు. దీంతో నాలుగో వికెట్‌కు 86 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరో బంతి వ్యవధిలోనే జడేజా డకౌట్‌గా వెనుదిరిగాడు. అయి నా రహానెతో పాటు భరత్, ఓవల్‌లో వరుస హాఫ్ సెంచరీలు చేసిన శార్దూల్ కూడా ఉండడంతో కనీసం డ్రా ఫలితం కోసమైనా అభిమానుల్లో ఆశలు కనిపించాయి. కానీ కాసేపటికే రహానెను స్టార్క్, శార్దూల్‌ను లియాన్ డకౌట్ చేయడంతో ఇక ఓటమి ఖాయమని తేలింది. తొలి ఇన్నింగ్స్‌లో మా బౌలర్లు మెరుగ్గానే రాణించారు. కానీ హెడ్, స్మిత్ భాగస్వామ్యంతోనే మ్యాచ్‌లో పట్టు కోల్పోయాం. అయినా గత నాలుగేళ్లలో రెండు ఫైనల్స్ ఆడడం మా ఘనతే అని రోహిత్ శర్మ అన్నాడు. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు సిద్ధమయ్యేందుకు మాకు సమయం లేకపోయిందన్నాడు.






## ఐర్లాండ్ క్రికెటర్ హ్యారీ టెక్టర్ సంచలనం

### ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు సొంతం



న్యూఢిల్లీ,జూన్12 : పసికూన ఐర్లాండ్ జట్టు నయా సంచలనం హ్యారీ టెక్టర్ అరుదైన ఘనత సాధించాడు. మే నెలకుగానూ అతను ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు అందు కున్నాడు. దాంతో, ఈ అవార్డుకు ఎంపికైన తొలి ఐర్లాండ్ ప్లేయర్‌గా రికా ర్డు సృష్టించాడు. ఈ అవార్డు కోసం పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజాం, బంగ్లాదేశ్ ఆటగాడు నజ్ముల్ హుసేన్ శాంటో పోటీలో నిలిచారు. అయితే.. ఓటింగ్‌లో ఈ ఇద్దరి కంటే టెక్టర్‌కు ఎక్కు వ ఓట్లు వచ్చాయి. దాంతో, ఐసీసీ ప్యానెల్ టెక్టర్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేసింది.ఐసీసీకి థ్యాంక్యూ.. ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. నాకు ఓటు వేసిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు. క్రికెట్ అనేది జట్టుగా ఆడాల్సిన ఆట. ఐర్లాండ్ పురుషుల జట్టు అద్భుత ప్రదర్శనకు, రాటుదేలుతున్న తీరుకు ఈ అవార్డు నిదర్శనం. జట్టు కోచ్, సహాయక సిబ్బంది సహకారం లేకుంటే నేను ఈ అవార్డుకు ఎంపికయ్యే వాడినే కాదు' అని టెక్టర్ తెలిపాడు. ఈ మధ్యే ఐర్లాండ్ మూడు వన్డేల సిరీస్ కోసం బంగ్లాదేశ్ పర్యటకు వెళ్లింది. ఈ సిరీస్‌లో 23 ఏళ్ల టెక్టర్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. వర్షార్పణం అయిన తొలి వన్డేలో అతను 21 రన్స్ కొట్టాడు. కీలకమైన రెండో వన్డేలో టెక్టర్ సెంచరీతో చెలరేగాడు. కేవలం 113 బంతుల్లోనే 140 పరుగులు సాధించాడు. అతడి విధ్వంసక ఇన్నింగ్స్‌లో 7 ఫోర్లు, 10 సిక్స్‌లు ఉన్నాయి. ఆఖరిదైన మూడు వన్డేలోనూ టెక్టర్ 45 రన్స్‌తో రాణించాడు. ఇప్పటివరకు టెక్టర్ 32 వన్డేలు, 57 టీ20లుమాత్రమే ఆడాడు.

## దేశం కోసం ఆడడంలోనే ఆనందం



### స్పీడ్‌స్టర్ మిచెల్ స్టార్క్ వెల్లడి

లండన్,జూన్12 : వరల్డ్ నంబర్ 1 జట్టు ఆస్ట్రేలియా టెస్టు చాంపియన్‌షిప్ విజేతగా అవతరించింది. ఓవల్ మైదానంలో సంచలన ఆటతో భారత్‌ను చిత్తుగా ఓడించి టెస్టు గదను సొంతం చేసుకుంది. స్పీడ్‌స్టర్ మిచెల్ స్టార్క్ నాలుగు వికెట్లతో ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. టెస్టు చాంపియన్‌షిప్ విజయాన్ని ఎంజాయ్ చేస్తున్న అతను ఫ్రాంచైజీ క్రికెట్‌పై సంచలన కామెంట్లు చేశాడు. తాను ఎల్లప్పుడూ ఫ్రాంచైజీల కంటే దేశానికి ఆడడానికే తొలి ప్రాధాన్యం ఇస్తానని అన్నాడు. ఐపీఎల్ ను నేను ఆస్వాదించాను. అయితే.. నాకు దేశం కోసం ఆడడమే టాప్ ప్రియారిటీ. అందకోసం ఫ్రాంచైజీని వదులుకునేందుకు నేను సిద్ధం. అలాగని ఆ తర్వాత ఎందుకిలా చేశాను? అని నేను బాధపడను. ఎందుకంటే..? డబ్బులు వస్తాయి.. పోతాయి' అని స్టార్క్ తెలిపాడు. అంతేకాదు ఫ్రాంచైజీ క్రికెట్‌తో కుప్పలుగా వచ్చి పడే సొమ్ము అంత మంచిది కాదని, అది తప్పు చేయడానికి కారకం అవుతుందని ఈ స్పీడ్‌స్టర్ తెలిపాడు. ఐసీసీ ట్రోఫీలతో హేజిల్‌వుడ్, డేవిడ్ వార్నర్, ప్యాట్‌కమిన్స్,స్టీవ్‌స్మిత్, మిచెల్ స్టార్క్‌డబ్ల్యూటీసీ విజయంతో మిచెల్ స్టార్క్ మరో ఘనత సాధించాడు. మూడు ఫార్మాట్లలో ఐసీసీ ట్రోఫీలు నెగ్గిన ఆస్ట్రేలియా జట్టులో సభ్యుడిగా అతను రికార్డుల్లోకి ఎక్కాడు. డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్, ప్యాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్ కూడా ఈ ఫీట్ సాధించారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092,PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com